రాజ్యాంగానికి అతీతంగా వ్యవహరిస్తున్నారు

- తమిళనాడు గవర్నర్‌పై సుప్రీం ఆగ్రహం
- పొన్ముడిపై 24 గంటల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశం

6

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 227 | విజయవాడ, శుక్రవారం 22 మార్చి 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 22 March 2024 | Rs



ఐపిఎల్ సంగ్రామం నేటినుంచే..

- చెన్నై-బెంగళూరు జట్ల మధ్య తొలిమ్యాచ్

6



పట్టుబడిన డ్రగ్స్ కంటైనర్

విశాఖలో ఆపరేషన్ గరుడ

- భారీ మొత్తంలో పట్టుబడ్డ డ్రగ్స్
- 25 వేల కిలోలు సీజ్
- అధికార పార్టీ హస్తం : చంద్రబాబు
- దొరికింది టిడిపి వారే : వైసిపి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అమరావతి బ్యూరో

ప్రతిష్టాత్మకమైన విశాఖ పోర్టులో అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్ బట్టబయలైంది. ఆపరేషన్ గరుడ పేరుతో సిబిఐ, కస్టమ్స్ అధికారులు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో 25 వేల కిలోల డ్రగ్స్ దొరికినట్లు గురువారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటన కలకలం రేపింది. దీనిని కొకైన్‌గా నిర్ధారించినట్లు సమాచారం. గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న ఈవ్యవహారం వెనుక రాష్ట్రంలోని అధికారపార్టీ హస్తం ఉందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆరోపించగా, దొరికింది తెలుగుదేశం పార్టీ వారేనని వైసిపి పేర్కొంది. సిబిఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బ్రెజిల్‌లోని శాంతోస్ పోర్టు నుంచి విశాఖ పోర్టుకు భారీగా డ్రగ్స్ రవాణా జరిగింది. అక్కడి నుండి వచ్చిన ఒక కంటైనర్‌లో 25 కిలోల చొప్పున 1,000 బ్యాగుల్లో మొత్తంగా 25 వేల కిలోల డ్రగ్స్ విశాఖ ఓడరేవుకు వచ్చినట్లు సిబిఐ తన నివేదికను గురువారం సాయంత్రం విడుదల చేసింది. విశాఖకు చెందిన ఒక ప్రైవేటు కంపెనీ ఇన్‌యాక్టివ్ డ్రైడ్ ఈస్ట్ పేరుతో వీటిని దిగుమతి చేసుకున్నట్లుగా అధికారులు తెలిపారు. ఇలా రవాణా జరిగిన మెటీరియల్‌లో డ్రగ్స్ ఉన్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన కస్టమ్స్ అధికారులు డ్రగ్స్‌ను గుర్తించి, మొత్తం సరుకును స్వాధీనం చేసుకున్నారు. సరుకును దిగుమతి చేసుకున్న కంపెనీ మీద, కొంతమంది ఏజెంట్లపైనా ఎఫ్‌ఐఆర్‌ను సిబిఐ నమోదు చేసింది. కస్టమ్స్ డిపార్టుమెంట్ సహాయంతో వైజాగ్ పోర్టులోనే ప్రైవేట్ షిప్పింగ్ కంపెనీ కంటైనర్‌ను సిబిఐ అదుపులోకి మిగతా 2లో

కేజ్రీవాల్ అరెస్టు

భారీ నిరసనలు • పలు పార్టీల ఖండన • ఢిల్లీ అంతటా నిషేధాజ్ఞలు

- సిఎంగా కేజ్రీవాల్ కొనసాగుతారు : ఆప్
- అర్ధరాత్రి విచారణ చేపట్టే అవకాశం





కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న ఇడి అధికారులు, నివాసం వద్ద మోహరించిన పోలీసులు

న్యూఢిల్లీ : ప్రతిపక్ష నాయకులను వేటాడడమే పనిగా పెట్టుకున్న కేంద్రంలోని నిరంకుశ మోడీ ప్రభుత్వం తాజాగా ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్‌పై పడింది. నాటకీయ పరిణామాల మధ్య ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) గురువారం రాత్రి కేజ్రీవాల్‌ను ఆయన నివాసంలో అరెస్టు చేసింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలన్నిటిని ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన రోజునే ఇడి ఈ చర్యకు పాల్పడడం గమనార్హం. ఇడి అరెస్టు చేసిన ఇండియా బ్లాక్ ముఖ్యమంత్రుల్లో కేజ్రీవాల్ రెండోవారు. ఇంతకుముందు జెఎంఎం నేత ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను ఇడి ఇదేవిధంగా అరెస్ట్ చేసింది. కేజ్రీవాల్ అరెస్టును ఇండియా బ్లాక్‌లోని భాగస్వామ్య పార్టీలు తీవ్రంగా ఖండించాయి. నిలిపేసిన మద్యం పాలసీ అవినీతి కేసులో ఇడి బలవంతపు చర్యల నుంచి రక్షణ కల్పించేందుకు ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో దీనిపై కేజ్రీవాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ విషయాన్ని అత్యవసరంగా విచారించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరారు. ఇంతలోనే ఇడి అధికారుల బృందం అయిదు బస్సుల నిండా రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఎఎఫ్)ను వెంటేసుకుని ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి, ఆయన నివాసంలో విస్తృతంగా సోదాలు నిర్వహించింది. ఆ వెంటనే ఆయనను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరిణామం పట్ల దిగ్భ్రాంతికి గురైన ఆప్ శ్రేణులు ఇది చర్యపై ఆగ్రహిస్తూ భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. దీంతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఢిల్లీ పోలీసులు నగరమంతటా నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టారు. ఆ ప్రాంతమంతా భయానకమైన వాతావరణం సృష్టించారు. ఇదిలావుండగా ఇడి సమన్లను సవాల్ చేస్తూ ఆప్ నేత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను జస్టిస్ సురేష్ కుమార్, జస్టిస్ మనోజ్ జైన్‌లతో కూడిన హైకోర్టు ధర్మాసనం వచ్చే నెల 22కి వాయిదా వేసింది. కేజ్రీవాల్ అరెస్టు కేంద్ర ప్రభుత్వం పన్నిన కుట్రగా ఆమాద్మీ పార్టీ నేతలు విమర్శించారు. ఢిల్లీ రాష్ట్ర మంత్రి అతిషి మాట్లాడుతూ,' కేజ్రీవాల్ అరెస్టు వార్త మాకు అందింది. కేజ్రీవాల్ జైలు నుండి ప్రభుత్వాన్ని నడుపుతారని మేము ఎప్పటి నుండో చెబుతున్నాం. ఆయన ఢిల్లీ ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. సుప్రీం కోర్టులో కేసు వేశాం. అత్యవసరంగా విచారించాలని మా న్యాయవాదులు కోరారు. ఇడి ఒక దర్యాప్తు సంస్థగా కన్నా బిజెపి చేతిలో రాజకీయ ఆయుధంగా పని చేస్తోంది' అని అన్నారు. ఢిల్లీ మేయర్ షెల్లీ ఒబెరాయ్ మాట్లాడుతూ, ఈ విషయం సుప్రీంకోర్టు ముందు ఉంది. ఏప్రిల్ 22న ఢిల్లీ హైకోర్టు దీనిని విచారణ చేపడతామని చెప్పింది. అలాంటప్పుడు ఇంత హడావుడిగా కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాల్సిన అవసరమేమొచ్చిందని అన్నారు. ఇదే కేసులో ఇంతకు ముందు ఆప్ నేతలు సంజయ్ సిన్హా, ఢిల్లీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియాలను అరెస్టు చేసిన ఇడి, గత వారం బిఆర్ఎస్ నేత కవితను అరెస్టు చేసింది. ఆయన అరెస్టు ముందు. లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరిగితే ఓటమి తప్పదన్న భయం తోనే రాజకీయ పత్యర్థులను వెంటాడి వేధించే చర్యలకు అది తెగబడుతోందని సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

కేజ్రీవాల్ అరెస్టును ఖండించిన సిపిఎం 2



"బిజెపిలోకి ఫిరాయించిన ప్రతిపక్ష నాయకులకు రక్షణ కల్పించి, ఆదరిస్తుంది. వారంతా సత్యహరిశ్చంద్రులు! ఈ అరెస్టులు బిజెపిని ఓడించి ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్న ప్రజల సంకల్పాన్ని మరింత దృఢతరం చేస్తుంది. "

- సీతారాం ఏచూరి

ఉమ్మడిగా పోటీ

- ఎన్‌డిఎ కూటమిని, వైసిపిని ఓడించాలని పిలుపు
- కామన్ మినిమం యాక్షన్ ఎజెండాపై చర్చ
- 'ఇండియా' భాగస్వామ్య పార్టీలు, రైతు, కార్మిక, మహిళా, ప్రజా సంఘాల ఐక్యవేదిక



అభివాదం చేస్తున్న ఇండియా ఫోరం, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తూ దేశానికి ప్రమాదకరంగా మారిన ఎన్‌డిఎ కూటమితోపాటు, రాష్ట్రంలో వైసిపిని ఓడించాలని, ఇండియా వేదిక భాగస్వామ్య పార్టీల నాయకులను గెలిపించాలని ఇండియా భాగస్వామ్య పార్టీల, భావ సారూప్య రాజకీయ, రైతు, కార్మిక, మహిళా, ప్రజా సంఘాల ఐక్యవేదిక సమావేశం పిలుపునిచ్చింది. బిజెపిని ఓడించకపోతే ప్రజాస్వామ్యంలో ఇవే చివరి ఎన్నికలు అవుతాయని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఉదయం విజయవాడ బాలోత్సవ భవన్లో ఐక్యవేదిక సమావేశం రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి లక్ష్మీనారాయణ, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్‌తోపాటు పలు ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల సన్నద్ధతపైనా, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపైనా సుదీర్ఘంగా చర్చించారు. అలాగే కామన్ మినిమం యాక్షన్ ఎజెండాను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు ప్రవేశపెట్టారు. దీనిపై పలువురు తమ అభిప్రాయాలు, పలు సూచనలూ మిగతా 2లో

శాంతిభద్రతలపై రాజీ వద్దు

- పల్నాడు, నంద్యాల, ప్రకాశం జిల్లాల ఎస్‌పిలతో సిఇఒ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో జరిగిన హింసాత్మక ఘటనలు, పల్నాడు జిల్లాలో ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న భద్రతా ఉల్లంఘనలు, ఇతరత్రా అంశాలపై ఆయా జిల్లాల ఎస్‌పిలు గురువారం ఎన్నికల కమిషన్‌ను కలిసి వివరణ ఇచ్చారు. ఈ ఘటనలపై తమ ఎదురుగా వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. దీంతో ఆ మూడు జిల్లాల ఎస్‌పిలు ఎ రఘువీర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి సచివాలయానికి చేరుకుని సిఇఒ మీనా, లా అండ్ ఆర్డర్ ఎడిజి బాగ్చితో సమావేశమై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరిని విడివిడిగా పిలిచి వివరణ తీసుకున్నారు. శాంతిభద్రతలు కాపాడే విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహించారని ప్రశ్నించారు. హత్యలు జరిగేంతలా పరిణామాలు చోటుచేసుకోవటంపై సిఇఒ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. మాచర్ల ప్రాంతంలో చాలా కాలం నుంచి ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా ఎందుకు కంట్రోల్ చేయలేదని సిఇఒ ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు జరిగితే సహించబోమని, వీటి పట్ల కఠినంగా వ్యవహరించాలని తేల్చిచెప్పినట్లు తెలిసింది. ముగ్గురు ఎస్‌పిల నుంచి తీసుకున్న వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ఎన్నికల సంఘం పంపబోతుంది.

మరోవైపు వైసిపి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైసిపి నాయకులు అంకం నారాయణమూర్తి తదితరులు సిఇఒను కలిసి టిడిపిపై ఫిర్యాదు చేశారు. నారా భువనేశ్వరి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, రాయచోటి టిడిపి అభ్యర్థి రామ్‌ప్రసాద్ రెడ్డి 'న్యాయం గెలవాలి' పేరుతో బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తూ, కోడ్ ఉల్లంఘించారని ఫిర్యాదు చేశారు. అలాగే టిడిపి నేత రామాంజనేయులు వైసిపి నేతపై దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని సిఇఒను కోరారు.

ఆ 167 మందినీ తొలగించొద్దు

- గ్రూప్-1 తీర్పుపై స్టే

2

ఆ మెసేజ్‌లు ఆపండి

- వికసిత్ భారత్‌పై కేంద్రానికి ఇసి ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల వేళ బాహాటంగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ ప్రధానమంత్రి కార్యాలయం నుంచి 'వికసిత్ భారత్' పేరిట పంపిస్తున్న వాట్సాప్ సందేశాలపై ఎన్నికల సంఘం ఎట్టకేలకు స్పందించింది. ఈ సందేశాలను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. దేశంలో మైబైల్ వినియోగిస్తున్న పౌరులకు, విదేశాల్లోని భారతీయులకు మోడీ కార్యాలయం నుంచి వాట్సాప్ సందేశాలు పంపడం వివాదస్పదమైన సంగతి విదితమే. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి పలు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఇసి చర్యలకు ఉప క్రమించింది. వాట్సాప్‌లో వికసిత్ భారత్ పేరుతో మెసేజ్‌లను తక్షణమే ఆపాలని గురువారం కేంద్ర సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తోందన్న విషయాన్ని గుర్తు చేసింది. అయినా, వికసిత్ భారత్ మెసేజ్‌లు రావడంపై కాంగ్రెస్ తదితర పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేశాయి.

39 మందితో సిపిఎం తొలి జాబితా

కేరళలో 15, బెంగాల్‌లో 13 స్థానాలకు అభ్యర్థులు ఖరారు



న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) గురువారం విడుదల చేసింది. రాష్ట్రాల వారీగా తొలి దశలో పోటీ చేసే స్థానాలను, అభ్యర్థుల వివరాలను వెల్లడించింది. తొలి జాబితాలో 39 మంది అభ్యర్థులను ప్రకటించారు. వామపక్షాలు అధికారంలో ఉన్న కేరళలో 15 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, పశ్చిమ బెంగాల్‌లో 13 స్థానాలకు, తమిళనాడు 2 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అలాగే ఢిల్లీలో అన్నదాతల పోరాటాలకు కేంద్ర బిందువులుగా నిలిచిన పంజాబ్‌లో జలంధర్ (ఎస్‌సి) నుంచి, రాజస్థాన్‌లోని సికార్ నుంచి సిపిఎం అభ్యర్థులను బరిలో నిలిపింది. జలంధర్ నుంచి పురుషోత్తం లాల్ బిల్గా పోటీ చేస్తుండగా, సికార్ నుంచి అమ్రారామ్ పోటీ చేయనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో తొలి జాబితాలో తెలంగాణలోని భువనగిరి స్థానం నుంచి మహ్మద్ జహంగీర్‌ను ప్రకటించారు. కోవిడ్ విపత్తులో వైద్య శాఖ మంత్రిగా విశేష సేవలందించి అంతర్జాతీయ సమాజ మన్ననలు పొందిన కెకె శైలజ టీచర్, ఆర్థిక వేత్త టిఎం థామస్ ఐజాక్, వ్యవసాయోద్యమ నాయకులు ఎ విజయరాఘవన్, ప్రముఖ పార్లమెంటేరియన్ ఎలమరం కరీం సహా జాతీయ స్థాయి కార్మిక, కర్షకోద్యమ నాయకులను సిపిఎం బరిలో నిలిపింది. తొలి జాబితాలో యువతకు కూడా ప్రాతినిధ్యం కల్పించారు. పశ్చిమ బెంగాల్‌లోని శ్రీరామ్‌పూర్ నుంచి విద్యార్థి ఉద్యమ నేత దిప్సితా ధర్‌ను బరిలో నిలిపారు.

జాబితా వివరాలు 6లో..



ఐబిఎ నూతన ఛైర్మన్‌గా ఎంవి రావు

న్యూఢిల్లీ : ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) నూతన ఛైర్మన్‌గా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ మాటమ్ వెంకటరావు నియమితులయ్యారు. గురువారం జరిగిన ఐబిఎ మేనేజింగ్ కమిటీలో ఆయనను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఛైర్మన్ దినేష్ కుమార్, ఇండియన్ బ్యాంక్ ఎమ్‌డి ఎస్‌ఎల్ జైన్, సిటీ యూనియన్ బ్యాంక్ ఎమ్‌డి ఎన్ కామకొడి ఉన్నారు. అదే విధంగా బ్యాంక్ ఆఫ్ బహ్రేన్ అండ్ కువైట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్, కంట్రీ హెడ్‌ను అసోసియేషన్ గౌరవ సెక్రటరీగా ఎన్నుకున్నారు.

పోస్టర్లూ.. ప్రింట్ చేయలేకపోతున్నాం

- పర్యటనలకూ వెళ్లలేకపోతున్నాం
- ఎన్నికల వేళ పార్టీ బ్యాంకు ఖాతాల స్తంభనపై కాంగ్రెస్ నేతలు
- కాంగ్రెస్ పోటీ చేయకుండా అడ్డుకునేందుకే మోడీ కుట్ర

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసిన కేంద్రం తీరుపై ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎఐసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేతో పాటు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, అజయ్ మాకెన్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు కేవలం తమ పార్టీకే కాదు, యూవత్ ప్రజాస్వామ్యానికే హానికరమని అన్నారు. పార్టీ కోసం ప్రజలు ఇచ్చిన విరాళాలను వాడుకోకుండా అడ్డుకోవడం అప్రజాస్వామి కమన్నారు. మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తోందన్నారు. బిజెపి వేల కోట్లు విరాళాలుగా తీసుకుందని, అయినా వారి ఖాతాలకు ఎలాంటి ఇబ్బంది లేదని, కేవలం తమ పార్టీ ఖాతాలనే స్తంభింపచేయడం కేంద్ర ప్రభుత్వ కుట్ర అని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిష్పక్షపాత ఎన్నికలు జరగాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరికీ సమానమైన అవకాశాలుండాలని ఖర్గే పేర్కొన్నారు. ఒక రాజకీయ పార్టీని ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డంకులు సృష్టించడం దారుణమని అన్నారు.

ప్రధాని మోడీ వ్యవస్థీకృత దాడి: సోనియా గాంధీ

కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంపై సోనియా గాంధీ తొలిసారి మీడియాతో మాట్లాడారు. ఒక పథకం ప్రకారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయాలని చూస్తున్నారని విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్ల అంశం కేవలం కాంగ్రెస్ పార్టీపై మాత్రమే ప్రభావం చూపదని, ప్రాథమికంగా అది మన ప్రజాస్వామ్యాన్నే దెబ్బతీస్తుందని ఆమె తెలిపారు. విపత్కర పరిస్థితులు, సవాళ్ల మధ్య తమ ఎన్నికల ప్రచారాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ఆమె అన్నారు. ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, వీటి వల్ల బిజెపికి అధిక లాభం చేకూరిందని, ఆ పార్టీని విడిచిపెట్టి మా పార్టీపై దాడి దారుణమన్నారు.

ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించలేకపోతున్నాం: రాహుల్

కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్లను స్తంభింపజేయడంతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించలేకపోతున్నామని ఎంపి రాహుల్ గాంధీ తెలిపారు. ఎవరిదైనా బ్యాక్ అకౌంట్ మూసివేసినా, ఎటిఎం కార్డు పని చేయకుండా చేస్తే జీవించగలరా? అని ప్రశ్నించారు. ఎన్నికలకు రెండు నెలల ముందే తమ పార్టీని నిర్వీర్యం చేయడానికి ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా.. క్రిమినల్ చర్యకు దిగారని రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉన్న కొన్ని సంస్థలు ఇప్పుడు ఆ పనిచేయలేకపోతున్నాయని, కోర్టులు కూడా ఇది అన్యాయమని గట్టిగా చెప్పలేకపోతున్నాయని, ఎన్నికల సంఘం మౌనంగా ఉండిపోయిందని విమర్శించారు. భారత్‌లో ఇప్పుడు ప్రజాస్వామ్యం లేదని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

పార్టీ ఖాతాల్లో ఉన్న రూ. 285 కోట్లను వాడుకోకుండా అడ్డుకోవడంతో ఎన్నికల పోస్టర్లు కూడా వేయలేని పరిస్థితి కల్పించారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే ప్రజలు తమకు మద్దతు ఇవ్వాలని అన్నారు. ఏడేళ్ల నాటి కేసులో పార్టీకి నోటీసులు జారీ చేశారని అన్నారు. బిజెపితో సహా ఏ రాజకీయ పార్టీ కూడా ఆదాయపు పన్ను చెల్లించనప్పటికీ, కాంగ్రెస్‌కు చెందిన 11 బ్యాంకు ఖాతాలను ఎందుకు స్తంభింప చేశారని ఆయన ప్రశ్నించారు.

జగన్ చిత్రంతో చేతివాచీలు

- బాగేపల్లిలో పట్టుకున్న పోలీసులు
- అనంత ముఖ్యనేత గన్‌మెన్‌పై కేసు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



సిఎం ఫొటోతో ఉన్న చేతిగడియారం

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లకు తాయిలాలు వేసేందుకు నేతలు సిద్ధం అయ్యారు. అందులో భాగంగా వైసిపి అధినేత, సిఎం జగన్ చిత్రంతో ఉన్న చేతి గడియారాలను ఓ కారులో తరలిస్తూ కర్ణాటక పోలీసులకు పట్టుబడ్డారు. అనంతపురం నుంచి బెంగళూరుకు జగన్ చిత్రం ఉన్న 96 చేతి గడియారాలను కారులో తరలిస్తున్నారు. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీలు చేస్తుండగా జగన్ ఫొటోలు ఉన్న వాచీలను గుర్తించారు. కారులో ఉన్న గన్‌మెన్ బండి నాగేంద్రపై కేసు నమోదు చేశారు. వాచ్‌లను తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో బెంగుళూరుకు వలస వెళ్లిన ఓటర్లకు వీటిని అందించేందుకు అనంతపురం జిల్లాకు చెందిన వైసిపి ముఖ్య నాయకుడు వీటిని తరలిస్తున్నట్లు సమాచారం.

కడప బరిలో షర్మిల

- కార్యకర్తల సమావేశంలో సానుకూలం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల కడప పార్లమెంట్ స్థానం నుంచి ఎన్నికల బరిలోకి దిగడానికి రంగం సిద్ధమైంది. అధిష్టానం సూచన మేరకు ఆ స్థానం నుండి పోటీ చేయడానికి ఇప్పటికే సుముఖత వ్యక్తం చేసిన షర్మిల గురువారం కడప నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశమైనారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో షర్మిల పోటీకి సానుకూలత వ్యక్తమైంది. కాంగ్రెస్ పార్టీ మరో రెండు రోజుల్లో మూడో జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. ఆ జాబితాలో షర్మిల పేరు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. కడప పార్లమెంట్ స్థానం మొదటి నుండి కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉంది. అయితే, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైసిపి ఏర్పాటయినప్పటి నుండి ఆ పరిస్థితి మారింది. షర్మిల కడప నుండి పోటీ చేస్తే గెలిచే అవకాశం ఉందని భావిస్తున్నారు.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న సజ్జల, తదితరులు

అవినీతిని వ్యవస్థీకృతం చేసిన చంద్రబాబు

- మహా దోపిడీ పుస్తకావిష్కరణలో సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవినీతిని వ్యవస్థీకృతం చేశారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని ఫార్చ్యూన్ గ్రాండ్ హోటల్‌లో అధికార భాషా సంఘం అధ్యక్షులు పి విజయబాబు రచించిన మహా దోపిడీ పుస్తకాన్ని సజ్జల గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. చంద్రబాబు తన జీవితంలో అవినీతి ఎలా చేశారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన నిధులను ఎలా కొల్లగొట్టారు అనే అంశాన్ని ఈ పుస్తకంలో వివరించారని పేర్కొన్నారు. చంద్రబాబు అంతటి అవినీతి పరుడు లేరని ప్రధాని నరేంద్ర మోడీ సైతం విమర్శించారని, ఇప్పుడు ఆయనతో బిజెపి ఎలా పొత్తుపెట్టుకుందో ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో ఆపరేషన్ గరుడ

మొదటిపేజి తరువాయి

తీసుకుని డ్రగ్స్‌ను సీజ్ చేసింది. ఇంత భారీ పరిమాణంలో డ్రగ్స్ లభ్యం కావడం ఇదే తొలిసారి కావడంతో పోర్టు వర్గాల్లోనూ సంచలనం రేకెత్తిస్తోంది.

సిబిఐ నివేదికలో ఏముంది?

చంద్రబాబు చేసిన ట్వీట్‌లో సిబిఐ నివేదికలోని కొంత భాగాన్ని జతచేశారు. దానిలో పేర్కొన్న అంశాల ప్రకారం స్థానిక సంధ్య అక్వా ఎక్స్‌పోర్ట్సు ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ప్రతినిధి ఆర్‌విఎల్‌ఎన్ గిరిధర్‌తో పాటు మరికొందరు, స్వతంత్ర సాక్షుల సమక్షంలో తనిఖీలు జరిపారు. పట్టుబడ్డ అన్ని బ్యాగుల్లోనూ కొకైన్ లేదా మెథాకోల్వన్ ఉన్నట్లు తేలింది. ఈ మేరకు జరిపిన పరీక్షల్లో పాజిటివ్ వచ్చినట్లు అధికారులు పేరొన్నారు. దీనిపై సంస్థ ప్రతినిధి గిరిధర్‌ను ప్రశ్నించగా మొదటి సారి ఆ సరుకును దిగుమతి చేసుకున్నట్లు తెలిపారని పేర్కొన్నారు.

ఎన్నికల కోసమే : బాబు

ఆంధ్రప్రదేశ్ అధికారులు తమకు సహకరించకుండా దూరంగా నిలబడ్డారని ప్రత్యేకంగా పేర్కొన్నారు. దీనినే ప్రస్తావించిన టిడిపి అధినేత చంద్రబాబు అధికారపార్టీ హస్తం ఉందనేందుకు ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల కోసమే ఇంత భారీ మొత్తంలో డ్రగ్స్‌ను రాష్ట్రానికి దిగుమతి చేసుకున్నారని ఆరోపించారు. మరో ప్రకటనలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ డ్రగ్స్ దిగుమతి కావడాన్ని సిగ్గుచేటుగా అభివర్ణించారు. గతంలో విజయవాడలో గంజాయి లింకులు బయటపడటాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఆయన కోరారు.

టిడిపి నేతలకు సంబంధాలు : వైసిపి

డ్రగ్స్ స్కామ్‌లో టిడిపి నేతలకు నేరుగా లింకులున్నాయని వైసిపి ఆరోపించింది. ఫేస్‌బుక్, ఎక్స్‌లలో చేసిన పోస్టులలో ఈ కేసులో నిందితుడిగా ఉన్న కోటయ్య చౌదరికి టిడిపి నేతలు దామచర్ల సత్య, లావు శ్రీ కృష్ణదేవరాయలు, రాయపాటి జీవన్‌లతో దగ్గరి సంబంధాలున్నాయని పేర్కొంది. దామచర్ల సత్య చంద్రబాబుకు ఆప్తుడని తెలిపింది. ఆ మేరకు ఫోటోలను విడుదల చేసింది. ఈ కేసులో లోకేష్‌కు, చంద్రబాబుకు నేరుగా సంబంధం ఉండే అవకాశం ఉందని, అందువల్లే ఉలిక్కిపడి ముందుగానే ట్వీట్లు చేస్తున్నారని పేర్కొంది.

అరకొరగానే ఎన్ఐడి

- పూర్తికాని భవనాలు
- ఎఎన్‌యులోనే ఇంకా తరగతులు

राष्ट्रीय डिज़ाइन संस्थान
National Institute of Design
ఆంధ్రప్రదేశ్ • आंध्र प्रदेश • Andhra Pradesh

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తవుతుంది. విభజన చట్టంలో పొందుపరిచిన విద్యాసంస్థల నిర్మాణం మాత్రం ఇప్పటికీ పూర్తికాలేదు. విద్యాసంస్థలకు నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్‌ఐడి)కు 2015లో రాజధాని అమరావతిలో శంకుస్థాపన జరిగింది. తొమ్మిదేళ్లు పూర్తయినా నిధులు లేకపోవడంతో ఇప్పటికీ భవనాలు పూర్తికాలేదు. టిడిపి ప్రభుత్వ హయాంలో అమరావతిలో 50 ఎకరాల భూమిని ఎన్‌ఐడికి కేటాయించింది. దీని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.200 కోట్లు నిధులు కేటాయించాల్సి ఉండగా, ఇప్పటికి రూ.20 కోట్లు మాత్రమే విడుదల చేసింది. అంటే మొత్తం బడ్జెట్‌లో 10 శాతమే. భవనాలు లేకపోవడంతో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఇఇఇ, ఇసిఇ భవనాల్లో ఏడేళ్ల నుంచి తరగతులు సాగుతున్నాయి. మొత్తం 300 మంది విద్యార్థులు ఎన్‌ఐడిలో చదువుతున్నారు. అమరావతిలోని సచివాలయానికి దగ్గరలో ఎన్‌ఐడి క్యాంపస్ నిర్మాణం జరుగుతోంది. అకడమిక్, లైబ్రరీ, హాస్టల్, వర్క్‌షాపు, ఆడిటోరియం, క్యాంటీన్, సిబ్బంది వసతి కోసం ఏడు భవనాల నిర్మాణం జరగాల్సి ఉంది. వీటిల్లో కేవలం అకడమిక్ భవన నిర్మాణం జరిగింది. హాస్టల్ భవనం తుది దశలో ఉంది. క్యాంటీన్ నిర్మాణ దశలో ఉంది. మిగిలిన నాలుగు భవనాల నిర్మాణం ఇప్పటి వరకు ప్రారంభించలేదు. నాగార్జున యూనివర్సిటీలో తరగతులు నిర్వహిస్తున్నారు.

కాంట్రాక్టు సిబ్బందే..

ఎన్‌ఐడిలో రెగ్యులర్ సిబ్బంది నియామకం కూడా పూర్తికాలేదు. దీంతో సగం సిబ్బంది కాంట్రాక్టు, గెస్ట్ పద్ధతిలోనే బోధన చేస్తున్న పరిస్థితి నెలకొంది. రెండు నెలల క్రితం ఎన్‌ఐడి డైరెక్టరు పదవీ విరమణ పొందారు. ఇప్పటి వరకూ ఆ పోస్టును భర్తీ చేయలేదంటే కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంపై ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోంది. రాష్ట్రాన్ని విద్యాకేంద్రంగా తీర్చిదిద్దేందుకు జాతీయ విద్యాసంస్థలను నెలకొల్పామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇటీవల చిలకలూరిపేట సభలో గొప్పగా చెప్పిన విషయం తెలిసిందే. ప్రధాని మాటలకే పరిమితమవుతున్నారని, చేతల్లో ఉండటం లేదని విద్యావేత్తలు విమర్శలు చేస్తున్నారు. మరోపక్క అమరావతి క్యాంపస్‌తో పాటే మధ్యప్రదేశ్‌లోని భోపాల్ క్యాంపస్‌నూ కేంద్ర ప్రారంభించింది. భోపాల్ క్యాంపస్ నిర్మాణం మొత్తం పూర్తవడమే గాక రెగ్యులర్ సిబ్బందిని కూడా కేంద్ర ప్రభుత్వం నియమించింది. మధ్యప్రదేశ్ బిజెపి పాలనలో ఉన్న విషయం గమనార్హం.

ప్రచారానికి వైసిపి అభ్యర్థుల తాత్కాలిక విరామం

- ముఖాముఖి భేటీలకు ప్రాధాన్యత


ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

వైసిపి అభ్యర్థులు ప్రచార వేగాన్ని తగ్గించారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మొదటి దశలోనే రాష్ట్రంలో ఎన్నికలు ఉంటాయని వైసిపి నాయకత్వం భావించింది. అనూహ్యంగా ఈ సారి నాల్గో దశలో మే 13న పోలింగ్ నిర్వహించనున్నట్టు ఈ నెల 16న ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీంతో పోలింగ్‌కు దాదాపు 57 రోజుల సమయం ఉండడంతో బాహ్య ప్రచారాన్ని కొద్దిరోజులపాటు నిలిపివేసి అంతర్గత సమావేశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ నాయకత్వం అభ్యర్థులకు మౌఖికంగా సూచించింది. ఈ నెల 27 నుంచి సిఎం జగన్ బస్సు యాత్ర ప్రారంభిస్తున్న నేపథ్యంలో అప్పటి నుంచి తిరిగి ఇంటింటి ప్రచారం ప్రారంభించాలని కోరినట్టు తెలిసింది. ఈ నెల 27 వరకు పార్టీలోని వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, ముఖ్యకార్యకర్తలతో ముఖాముఖీ సమావేశాలు నిర్వహించాలని సూచించింది. గుంటూరులో విస్తృతంగా ప్రచారం చేసిన మంత్రి విడదల రజనీ గత వారం రోజులుగా ఈ ప్రచారానికి విరామం ప్రకటించారు.

ఆమె బాటలోనే పలువురు అభ్యర్థులు అంతర్గత సమావేశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. 2019లో మార్చి 10న షెడ్యూలు రాగా మొదటి దశలోనే ఏప్రిల్ 11న రాష్ట్రంలో పోలింగ్ జరిగింది. ఈ సారి మే 13న పోలింగ్ తేదీ ఖరారు కావడంతో అభ్యర్థులు ఖర్చు తగ్గించుకోవడానికి ప్రస్తుతం ప్రజల్లోకి వెళ్లకుండా కార్యాలయాల్లో ముఖాముఖి సమావేశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఎన్నికల ప్రచారం మొదలుపెడదాం

- చంద్రబాబుతో పవన్ భేటీలో నిర్ణయం
- నేడు టిడిపి తుది జాబితా!



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టాలని టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ నిర్ణయించినట్లు తెలిసింది. చంద్రబాబుతో పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో గురువారం ఈ భేటీ జరిగింది. ఈ నెల 25లోపు ఇరు పార్టీల అభ్యర్థులను ప్రకటించి ప్రచారానికి వెళ్లాలని సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. ప్రజాగళం పేరుతో చంద్రబాబు ఈ నెల 26 నుంచి ప్రచారం ప్రారంభించనున్నారు. చిత్తూరు నుంచి మొదలయ్యే ఈ కార్యక్రమం 20 రోజులపాటు రోజుకు రెండు నియోజకవర్గాల్లో జరగనుంది. అలాగే ఈ నెల 27 నుంచి పవన్‌కల్యాణ్ కోస్తాంధ్ర నుంచి వారాహి యాత్రను ప్రారంభించనున్నారు. ఈ ప్రచారం ప్రారంభంలోపు అభ్యర్థుల ప్రకటన పూర్తిచేయాలని ఇరువురు నేతలు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పొత్తులో భాగంగా టిడిపికి 144 అసెంబ్లీ, 17 ఎంపి, జనసేనకు 21 అసెంబ్లీ, రెండు ఎంపి స్థానాలు కేటాయించిన సంగతి తెలిసిందే. వీటిల్లో ఇప్పటికే టిడిపి 128 స్థానాలకు, జనసేన 8 స్థానాలకు తమ అభ్యర్థులను ప్రకటించాయి. మిగిలిన స్థానాల్లో ప్రకటించాల్సిన అభ్యర్థులపై ఇరువురు అధినేతలు చర్చించినట్లు తెలిసింది. తమ పార్టీ నుంచి పెండింగ్‌లో ఉన్న 16 స్థానాలతో పాటు కొన్ని లోక్‌సభ స్థానాలకు శుక్రవారం అభ్యర్థులను ప్రకటిస్తానని పవన్‌తో చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది. జనసేన అభ్యర్థుల ప్రక్రియనూ పూర్తిచేయాలని పవన్‌కు చంద్రబాబు సూచించినట్లు సమాచారం. పోలవరం, తిరుపతి స్థానాలను పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. అయితే ఈ రెండు స్థానాలకు బదులు మరో రెండు ఇవ్వాలని చంద్రబాబును పవన్ కోరినట్లు సమాచారం. అలాగే ఉమ్మడి మేనిఫెస్టో, ఉమ్మడి సభలపై చర్చించినట్లు తెలిసింది. సీట్ల సర్దుబాటుపై బిజెపి రాష్ట్ర నాయకత్వం ఢిల్లీలో మకాం వేసిన సంగతి తెలిసిందే. ఈ అంశమూ ఇద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం.

తేలని సీట్ల పంచాయితీ

బిజెపి టిడిపి మధ్య కొనసాగుతున్న పేచీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి-జనసేన-బిజెపి పొత్తులో సీట్ల పంచాయితీ తేలడం లేదు. సీట్ల సంఖ్యపై అవగాహన వచ్చినా ఏ సీట్లలో ఎవరూ పోటీ చేయాలనే అంశంపై ఇప్పటికీ కొలిక్కి రావడం లేదు. దీంతో ఆ పార్టీల కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది. రాష్ట్రంలో ఎక్కడా సొంత బలంలేని బిజెపి టిడిపి-జనసేన ఓట్లతో ఎన్నికల్లో గెలవాలని భావిస్తోంది. దీనిలో భాగంగా ఆ రెండు పార్టీలు బలంగా ఉన్న స్థానాలను బిజెపి డిమాండ్ చేస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో అవనిగడ్డ, విజయవాడ పశ్చిమ స్థానాలను తొలినుంచి జనసేన పోటీ చేస్తుందని అనుకున్నారు. కానీ విజయవాడ పశ్చిమ తమకు కావాలని బిజెపి పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే టిడిపి తన అభ్యర్థులను ప్రకటించిన రాజమండ్రి సిటీ, రూరల్ స్థానాలను కూడా బిజెపి కోరుతోంది. కర్నూలు జిల్లాలో ఆదోని సీటు కూడా బిజెపి అడుగుతున్నట్లు సమాచారం.

ఎంపి స్థానాలపై

ఎంపి స్థానాల విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పొత్తులో భాగంగా బిజెపికి ఆరు స్థానాలు దక్కాయి. అరకు, విజయనగరం, రాజమండ్రి, అనకాపల్లి, నరసాపురం, తిరుపతి స్థానాలను తొలుత బిజెపికి కేటాయించిన్నట్లు సమాచారం. వీటిల్లో విజయనగరం, అనకాపల్లి స్థానాలకు బదులు చిత్తూరు, రాజంపేట స్థానాలు కావాలని బిజెపి కోరుతున్నట్లు సమాచారం. అదేవిధంగా విశాఖపట్నం స్థానం కూడా తమకు కావాలని అడుగుతోంది. వీటిలో అనకాపల్లి నుండి జివిఎల్ నరసింహరావు పోటీ చేసే అవకాశం ఉందని వార్తలు వస్తున్నా, బిజెపిలోని ఒక గ్రూపు ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది. మరోవైపు శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు స్థానాలను మాత్రం ఇచ్చేది లేదని టిడిపి ఇప్పటికే తేల్చిచెప్పినట్లు సమాచారం.

బిజెపి పోటీ చేసే స్థానాల విషయంలో స్పష్టత వస్తేగానీ టిడిపి అభ్యర్థులను ప్రకటించలేని పరిస్థితి నెలకొంది. లోక్‌సభ బరిలోకి దిగే అభ్యర్థుల జాబితాను టిడిపి ఇప్పటికే సిద్ధం చేసింది. శ్రీకాకుళం నుంచి కె రామ్మోహన్ నాయుడు, విజయవాడ నుంచి కేశినేని చిన్ని, గుంటూరు నుంచి పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట నుంచి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఒంగోలు నుంచి మాగుంట రాఘవరెడ్డి, నెల్లూరు నుంచి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నంద్యాల నుంచి బైరెడ్డి శబరి, అనంతపురం నుంచి బికె పార్థసారధి, అమలాపురం నుంచి గంటి హరీష్, బాపట్ల నుంచి ఎంఎస్ రాజులను చంద్రబాబు నాయుడు ఖరారు చేసిన్నట్లు చెబుతున్నారు.

జివిఎల్ కోసమేనా...?

- అనకాపల్లిలో బిజెపికి వైసిపి పరోక్ష సహకారం

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

అనకాపల్లి లోక్‌సభ స్థానంలో బిజెపికి వైసిపి నుండి పరోక్ష సహకారం లభించే అవకాశం ఉందని తెలిసింది. ఈ నియోజకవర్గంలో బిజెపి టిక్కెట్‌ను రాజ్యసభ మాజీ సభ్యులు జివిఎల్ నరసింహారావు ఆశిస్తున్న విషయం తెలిసిందే. అదే జరిగితే ఈ నియోజకవర్గంలో వైసిపి బలహీనమైన అభ్యర్థిని బరిలోకి దింపే అవకాశం ఉందని భావిస్తున్నారు. 24 లోక్‌సభ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన వైసిపి, అనకాపల్లి స్థానాన్ని పెండింగ్‌లో పెట్టడానికి ఇదే కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే, ఈ స్థానం కోసం బిజెపి నుండి సిఎం రమేష్ కూడా పోటీపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో బిజెపినుండి ఎన్నికల బరిలో దిగేది ఎవరో తేలేంతవరకు వైసిపి అభ్యర్థి విషయంలో స్పష్టత వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. జివిఎల్‌తో పాటు సోము వీర్రాజు, విష్ణువర్ధన్‌రెడ్డిలకు వైసిపి నుండి సహకారం లభించే అవకాశం ఉందని సమాచారం. వీరు గతంలో వైసిపికి కొంత అనుకూలంగా వ్యవహరించారు. బిజెపి అరకు లోక్‌సభ స్థానాన్ని కోరుతుండగా టిడిపి దానికి బదులుగా విజయనగరం స్థానం ఇచ్చేందుకు సుముఖత చూపుతోంది. దీంతో ఆ సీట్ల విషయం ఏమీ తేలలేదు.

నరసాపురం నుంచి వైసిపి రెబల్ ఎంపి రఘురామకృష్ణమరాజు పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతుండగా, బిజెపిలోని పాత నాయకుల్లో ఒకరు రఘురామకు టిక్కెట్ దక్కనీయకుండా చేసేందుకు లాబీయింగ్ నడుపుతున్నట్లు చర్చ నడుస్తోంది. ఎంపి సీట్ల విషయం ఇలా ఉంటే ఎమ్మెల్యే సీట్ల విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. ఇప్పటి వరకు అరకు, విశాఖ ఉత్తరం నియోజకవర్గాల విషయంలో స్పష్టత వచ్చినట్లు చెబుతున్నారు.

ఉమ్మడిగా పోటీ

మొదటిపేజి తరువాయి

చేశారు. దీని అమలు కోసం ప్రత్యేక బృందాన్ని వేస్తామని ప్రకటించారు.

ఆత్మగౌరవంలో ఆఖరి స్థానం
వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితి అప్పు పెట్టడంలో మొదటిస్థానం, ఆత్మగౌరవంలో అఖరి స్థానంలో ఉందని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. మరోసారి కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చి మనువాద రాజ్యాంగాన్ని అమల్లోకి తెస్తారని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బిజెపికి ప్రత్యక్షంగా మద్దతు ఇస్తున్న టిడిపి, జనసేన, పరోక్షంగా మద్దతు ఇస్తూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని మోడీ కాళ్ల వద్ద పెట్టిన వైసిపిని ఓడించాలని కోరారు. ఇప్పటికే మతం పేరుతో బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పెద్దయెత్తున దాడులు చేస్తూ మైనార్టీలు, దళితులను చంపుతున్నారని, అటువంటి బిజెపిని మరోసారి అధికారంలోకి రానీయొద్దని, దీనికోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని కోరారు.

దేశానికి బిజెపి పాలన మంచిది కాదు
వైఎస్ షర్మిల

దేశానికి బిజెపి పాలన మంచిది కాదని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల అన్నారు. బిజెపి పాలనలో విలువలు దిగజారిపోతున్నాయని, భవిష్యత్ తరాలకు తీవ్ర ప్రమాదమని షర్మిల తెలిపారు. బిజెపి పాలన ఒక అరాచకమని, మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ స్వార్థ రాజకీయాలతో దేశాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. ఇండియా వేదిక, భాగస్వామ్య పార్టీలు చేసే పోరాటం భవిష్యత్ తరాల కోసమని చెప్పారు. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ మతం పేరుతో చిచ్చుపెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి పాలకులు పోర్టులను తక్కువ ధరకు అదానీకి కట్టబెట్టారని, విశాఖ స్టీలునూ అమ్మేస్తున్నారని అన్నారు. ప్రత్యేక హోదా ఊసే లేకుండా చేశారని మండిపడ్డారు. మోడీ మోసాలపై బాబు, జగన్ ఇద్దరూ మౌనం వహించారని, పదేళ్లుగా రాష్ట్రానికి రాజధాని లేకపోయినా అడగలేదని, వారిద్దరికీ మనస్సాక్షి లేదని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అందరినీ కలుపుకుని ముందుకు వెళతామని, ఉద్యమాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవాన్ని మోడీ కాళ్లదగ్గర పడేసిన బాబు, జగన్
వి శ్రీనివాసరావు

తెలుగువారి ఆత్మగౌరవం, కీర్తి ప్రతిష్టలను జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు.. మోడీ కాళ్ల దగ్గర పడేశారని, రాబోయే ఎన్నికల్లో వారిని ఓడిస్తేనే తెలుగు ప్రజల గౌరవం నిలబడుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. ప్రజాగళం సభలో పాల్గొన్న మోడీ.. చంద్రబాబుకు ఓటేయాలనిగానీ, జగన్‌ను గద్దెదించాలని గానీ చెప్పలేదని, అటువంటి బిజెపిని, దానికి మద్దతు ఇస్తున్న మూడు పార్టీలకు ఓటు వేయడం కంటే సిగ్గుమాలిన పని మరొకటి లేదని అన్నారు.

తెలుగు ప్రజల పౌరుషానికి పెద్ద సవాలు వచ్చిందన్నారు. ప్రత్యేక హోదా, రాజధాని ఇస్తామని చెప్పినా రాజధాని గురించి మోడీ ఒక్కమాట కూడా మాట్లాడలేదని ఆగ్రహించారు. ఎలక్టోరల్ బాండ్లపై దేశంలో పెద్దయెత్తున చర్చ జరుగుతున్నా వందల కోట్లు అందుకున్న జగన్, బాబు తేలుకుట్టిన దొంగల్లా నోరెత్తడం లేదని విమర్శించారు. టెక్నాలజీతో హైదరాబాద్, రష్యా సాయంతో విశాఖపట్నం అభివృద్ధి చెందాయని, అయితే తామే చేశామన్నట్లుగా బాబు, జగన్ చెప్పడం సరికాదని అన్నారు. సహజ వనరుల దోపిడీ, ఆస్తులను బడా కార్పొరేట్లకు కట్టబెట్టడం తప్ప వీరు చేసిందేమీ లేదని అన్నారు. ఈ నేపథ్యంలో ఇండియా భాగస్వామ్య పార్టీల అభ్యర్థులను గెలిపించాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ అసంఘటిత రంగ, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు సంబంధించి కామన్ మినిమం యాక్షన్ ఎజెండాలో పొందుపరిచేలా పలు సూచనలు చేశారు.

కేంద్ర సంస్థలతో బెదిరింపులు
కె రామకృష్ణ

దేశంలో మోడీ మైండ్‌గేమ్ ఆడుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. 2014లో ఇచ్చిన ఒక్క హామీని కూడా మోడీ మరలా ప్రస్తావించలేదని అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతోందని, రైతులు నష్టపోతున్నారని, ధరలు పెరుగుతున్నాయని వాటి గురించి మోడీ మాట్లాడటం లేదని అన్నారు. బ్లాక్‌మనీ తెస్తానని చెప్పిన మోడీ ఒక్క రూపాయి కూడా బయటపెట్టింది లేదని అన్నారు. కేంద్రం సిబిఐ, ఇడి, ఐటిలను వాడుకుంటుంటే రాష్ట్రంలో జగన్ సిఐడిని వాడుకుంటున్నారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో టిడిపి కూటమి, జగన్ వైసిపి తరపున ఎవరు గెలిచినా వారంతా మోడీ జేబులో బొమ్మలేనని విమర్శించారు. వారికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

పేదలు బతకలేని పరిస్థితి
వివి లక్ష్మీనారాయణ

దేశంలో పేదలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి లక్ష్మీనారాయణ అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతోందని, 35 వేల పోస్టులకు ఆర్‌ఆర్‌బి నోటిఫికేషన్ ఇస్తే 1.25 కోట్ల మంది దరఖాస్తు చేశారని, ఇంతకంటే ప్రత్యక్ష ఉదాహరణ మరొకటి అవసరం లేదని పేర్కొన్నారు.

బిజెపి గెలిస్తే తరతరాలకు నష్టం
చలసాని శ్రీనివాసరావు

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి కూటమి గానీ, వైసిపి గానీ అధికారంలోకి వస్తే తరతరాల ప్రజలకు నష్టం వాటిల్లుతుందని, ఆ పార్టీలను ఓడించాలని ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాసరావు కోరారు. హోదా ఇవ్వకపోతే పది తరాలు దెబ్బతింటాయని, ప్రజాస్వామ్యమనేది ఉండదని అన్నారు.

ఈ సమావేశంలో ప్రముఖులు పోతుల బాలకోటయ్య, డివివిఎస్ వర్మ, తెలుగుసేన అధ్యక్షులు సత్యారెడ్డి, చుండూరి రంగారావు, భారత్ బచావో నాయకులు భాస్కరరావు, రైతుకూలీ సంఘం నాయకులు సింహాద్రి ఝాన్సీ, హరినాథ్, బి శ్రీనివాసరావు, మనోరమ, నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం, మేలుకో ఆంధ్రప్రదేశ్ నాయకులు రమేష్ పట్నాయక్ తదితరులు మాట్లాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, వి ఉమామహేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, మంతెన సీతారాం, కాంగ్రెస్ నాయకులు సుంకర పద్మశ్రీ, మస్తాన్‌వలీ, తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుడిపై పెత్తందార్ల దాడి

ప్రజాశక్తి-త్రిపురాంతకం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలోని ఎండూరివారిపాలెం గ్రామంలో కుల వివక్ష పడగ విప్పింది. ఆ గ్రామంలో పంచాయతీ నిధులతో నిర్మాణం చేపట్టిన రోడ్లపై నడవనియ్యకపోవడం, దళితులకు చెందిన మురుగు నీటిని ప్రవహించకుండా పెత్తందారులు అడ్డుకున్నారు. దీంతో దళితులు గ్రామ పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఆయన వచ్చి పరిశీలించి ఇది పంచాయతీకి చెందినదని ఈ విషయంలో ఎవరు గొడవ పడవద్దని, ఇరు వర్గాలకు సర్ది చెప్పి వెళ్లారు. 'మాపై పంచాయతీ అధికారికి ఫిర్యాదు ఇచ్చే మొనగాళ్లా..' అంటూ ఫిర్యాదు చేసిన యామర్తి త్రిపురాంజనేయులును బుధవారం సాయంత్రం పెత్తందారులు బాసిబోయిన పేరయ్య, తోట గోవర్ధన్ కాళ్లతో తన్ని, చెప్పులతో కొట్టి దాడి చేశారు. గాయపడిన త్రిపురాంజనేయులును యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు కుటుంబ సభ్యులు తరలించారు. త్రిపురాంజనేయులును గురువారం కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జువ్వాజి రాజు, బి.రఘురాం, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దేవెండ్ల శ్రీనివాస్, సిఐటియు నాయకులు లాభాను, దళిత సంఘాల నాయకులు పరామర్శించారు. దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కేజ్రీవాల్ అరెస్టును ఖండించిన సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తర్వాత ఇడి అధికారులు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఇంట్లో సోదాలు నిర్వహించి అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీ ప్రజలను భయకంపితులను చేసి ఎన్నికల్లో లాభపడాలని బిజెపి ప్రయత్నిస్తోందని అన్నారు. బిజెపి కక్షపూరిత, ప్రతీకార చర్యలను, నిరంకుశ పద్ధతులను ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ ప్రతిపక్షాలు ప్రత్యేకంగా ఇండియా ఫోరం పార్టీలపై రాజకీయ కక్షపూరిత చర్యలను ఆపాలని విజ్ఞప్తి చేశారు.

దళిత విద్యార్థిపై అధ్యాపకుడి దాడి

- బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఘటన

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిపై అధ్యాపకుడు విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన గురువారం వెలుగు చూసింది. బాపట్ల రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. పొన్నూరు మండలం మాచవరం గ్రామానికి చెందిన బొనిగల నవదీప్ పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. క్రమశిక్షణ విషయంలో నవదీప్‌ను కళాశాల అధ్యాపకుడు బాలాజీ మందలించారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. కర్రతో నవదీప్‌ను విచక్షణారహితంగా అధ్యాపకుడు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థి బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందున్నారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అధ్యాపకుడిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆ 167 మందినీ తొలగించొద్దు


- గ్రూప్-1 తీర్పుపై స్టే

ప్రజాశక్తి-అమరావతి

ఎపిపిఎస్‌సి గ్రూప్ - 1 నోటిఫికేషన్ ద్వారా ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న 167 మందికి హైకోర్టులో ఊరట లభించింది. తిరిగి ఉత్తర్వులు జారీ చేసే వరకు వారిని విధుల నుంచి తొలగించరాదని ఆదేశించింది. ఎపిపిఎస్‌సి దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌లో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను ఈ నెల 27కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ నూనేపల్లి హరినాథ్ ధర్మాసనం ప్రకటించింది. గ్రూప్-1 మెయిన్స్‌పై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేయాలంటూ ఎపిపిఎస్‌సి దాఖలు చేసిన అప్పీల్‌తో ఇతర అప్పీళ్లను కలిపి విచారణ చేస్తామని ప్రకటించింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా పత్రాల మూల్యాంకనంలో లోపాలు జరిగాయని సింగిల్ జడ్జి తీర్పు చెప్పారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ ఈ నెల 13న తీర్పు చెప్పారు. గ్రూప్-1 మెయిన్స్‌లో అర్హత సాధించిన వారి లిస్టును కూడా రద్దు చేశారు. తిరిగి గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని సర్వీస్ కమిషన్‌ను ఆదేశించారు. మొత్తం ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేయాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ తీర్పును రద్దు చేయాలని కమిషన్ తరపు సీనియర్ అడ్వకేట్ ఎస్-ఎస్ ప్రసాద్ వాదించారు. పిటిషన్‌లో లేని అంశాల్లోకి వెళ్లి సింగిల్ జడ్జి తీర్పు చెప్పారన్నారు. పిటిషనర్లు అభ్యర్థించని అంశాలపై ఉత్తర్వులు జారీ చేయడం చెల్లదన్నారు. మూల్యాంకనం చేపట్టాలన్న సింగిల్ జడ్జి తీర్పు చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. పిటిషనర్ల తరపున లాయర్లు జొన్నలగడ్డ సుధీర్, రవిశంకర్ వాదించారు. సింగిల్ జడ్జి తీర్పులో కొంత భాగంపై వ్యతిరేకత ఉందన్నారు. తొలి మూల్యాంకనంపై అభ్యంతరం చెప్పలేదని, ఆ మూల్యాంకనం ఫలితాలు వెల్లడించాలని కోరామని వివరించారు. ఇందుకు విరుద్ధంగా మొదటి మూల్యాంకనాన్ని రద్దు చేయడం అన్యాయమన్నారు. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు విచారణను 27కి వాయిదా వేసింది.

గ్రామసేవకుల సంఘం
రాష్ట్ర మాజీ అధ్యక్షులు నాగయ్య మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)



గ్రామ సేవకుల సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు గుర్రం నాగయ్య (72) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. బుధవారం సాయంత్రం ఆయన ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం పట్టణంలోని మాచర్ల రోడ్డులో గల తన ఇంటికి వెళ్తున్న సమయంలో మోటారుసైకిల్ ఢీకొన్నది. ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించి ఆయన మరణించారు. గ్రామ సేవకుల సంఘం యర్రగొండపాలెం మండల అధ్యక్షుడి స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అధ్యక్షులుగా పనిచేశారు. ఆయన అధ్యక్షులుగా ఉన్న సమయంలో అప్పటి వైఎస్‌ఆర్ ప్రభుత్వంతో పోరాడి.. గ్రామసేవకులకు ప్రమోషన్ల జిఒను సాధించారు. ఆ జిఒ ఫలితంగా వేలాదిమంది గ్రామసేవకులు విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతి పొందారు. గుర్రం నాగయ్య మృతదేహాన్ని సిఐటియు, సిపిఎం, సిపిఐ నాయకులు సందర్శించి, నివాళులర్పించారు.



ముగిసిన కెవి రత్నం అంత్యక్రియలు

ప్రజాశక్తి- నెల్లూరు

ప్రముఖ విద్యావేత్త కెవి రత్నం అంత్యక్రియలు గురువారం ముగిశాయి. నెల్లూరులోని ముత్తుకూరు గేట్ సమీపంలోని ఆయన అతిథి గృహం నుంచి ముత్తుకూరు మండలం పిడాతపోలూరు గ్రామం వరకూ అంతిమయాత్ర నిర్వహించారు. పూర్వ విద్యార్థులు, వివిధ విద్యా సంస్థల అధిపతులు, తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. పిడాతపోలూరు గ్రామంలోని రత్నం గార్డెన్స్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులను ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి నారాయణ, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మీనారాయణ తదితరులు పరామర్శించారు. అంతకు ముందు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీనియర్ నేత చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు తదితరులు నివాళులర్పించారు.

ప్రముఖులకు ప్రొటోకాల్ బంద్

- కోడ్‌తో జివిడి సర్క్యులర్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రానికి వచ్చే ప్రముఖులు, అతిథులకు కల్పించే ప్రొటోకాల్ సౌకర్యాన్ని ఎన్నికల కోడ్ సందర్భంగా రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు డిజిపి, ఇంటెలిజెన్స్, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, పోలీస్ కమిషనర్లు, తిరుమల తిరుపతి దేవస్థానం వంటి వాటికి సాధారణ పరిపాలనశాఖ సర్క్యులర్లు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ కమిషనర్ నుంచి ఇదే అంశాలపై ఆదేశాలు కూడా వచ్చాయి. రాష్ట్ర, కేంద్ర మంత్రులు, వారితో వచ్చే సహాయక సిబ్బంది, ఇతర అధికార ప్రముఖులు, రాష్ట్రానికి వచ్చే సమయంలో గతంలో కల్పించిన అతిథి మర్యాదలను కోడ్ కారణంగా రద్దు చేయాలని నిర్దేశించారు. అయితే శాంతిభద్రతలకు విఘాతం కలిగిన సమయంలో, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో సహాయక చర్యలు, సమీక్షలకు వచ్చేవారికి మాత్రం ఈ విషయంలో వెసులుబాటు కల్పించాలని నిర్ణయించారు.

మే 2 నుంచి ఎపి ఆర్ సెట్

ప్రజాశక్తి - క్యాంపస్ (ఎస్‌వియు)

ఎపి ఆర్ సెట్ 2023-24 ప్రవేశ పరీక్షలు మే 2 నుంచి 5 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పిహెచ్‌డి సీట్ల భర్తీకి ఎపి ఆర్ సెట్ 2023- 24 నోటిఫికేషన్ వెలువడిన విషయం తెలిసిందే. మార్చి 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగిసింది. అయితే, ఈ నెల 29 వరకు రూ. రెండు వేలు అపరాధ రుసుంతో, ఏప్రిల్ 6 వ తేదీ వరకు రూ. ఐదు వేలు అపరాధ రుసుంతో దరఖాస్తు గడువు ఉంది. ఏప్రిల్ 10వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ఈ మేరకు ఎపి ఆర్ సెట్ 2023 -24 కన్వీనర్ ప్రొఫెసర్ బి దేవప్రసాదరాజు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్‌పై కేసు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

వైఎస్‌ఆర్ జిల్లా ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాల బంగారు మునిరెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సోదరుడు కిరణ్‌కుమార్‌రెడ్డిపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సిఐ కరీం గురువారం తెలిపారు. వివేకానంద కాలనీలో ముందస్తు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించినందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇదే కాలనీలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వలంటీర్ కాసారపు సుబ్బరావు, రేషన్‌డీలర్ జంగమయ్యపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు

పలు జిల్లాల్లో 20 మందిపై వేటు



చిత్తూరు జిల్లా గుడిపల్లిలో రాజీనామా పత్రాలను ఎంపిడిఒకు అందజేస్తున్న వలంటీర్లు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్న వలంటీర్లపై ఎలక్షన్ కమిషన్ చర్యలు కొనసాగుతున్నాయి. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను పక్కనపెట్టి ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్న వారిపై వేటు వేస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 11 మంది వలంటీర్లపై వేటు పడగా.. విజయనగరంలో నలుగురు, పల్నాడులో ఐదుగురిని విధుల నుంచి తొలగిస్తూ గురువారం అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం పాంచాలి గ్రామంలో ఈ నెల 19న 11 మంది వలంటీర్లు రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో పాల్గొన్నట్టు ఫిర్యాదులు రావడంతో వారిని సాలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించినట్లు ఎంపిడిఒ లక్ష్మీకాంత్ తెలిపారు. వైసిపి నిర్వహించే కార్యకలాపాల్లో వలంటీర్లు పాల్గొన్నారని ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన వాట్సాప్‌కు టిడిపి నాయకులు ఫొటోలను పంపించడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు బత్తుల కృష్ణ, బోనెల మహేశ్, గరివిడి మండలం చుక్కవలసలో కిల్లాన ప్రసాద్, రేవళ్ల త్రినాథ్‌లను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎస్ నాగలక్ష్మి తెలిపారు. స్థానిక శాసన సభ్యునితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్టు ఫిర్యాదులు అందడంతో వారిని విధుల నుంచి తొలగించినట్టు చెప్పారు. పల్నాడు జిల్లాలో ఐదుగురిని విధుల నుంచి తొలగించారు. వినుకొండ మండలం ఏనుగుపాలెంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పిల్ల కదుపుల నాగరాజు, వజ్జా రామ కోటేశ్వరరావు, గుమ్మా వెంకటేశ్వరరావు, బెల్లంకొండలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వలంటీర్ పర్వతం రాములు, యానిమేటర్ కందుల వెంకటేష్‌పై చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి శివ శంకర్ లోతేటి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు పలు దినపత్రికల్లో వచ్చిన వార్తలపై స్పందిస్తూ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు

శ్రీకాకుళం జిల్లా మందస మండలం భోగాపురంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎ.దేవేంద్రను విధుల నుంచి తొలగించినట్లు డ్వామా పిడి జివి చిట్టిరాజు తెలిపారు. రాజకీయ పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదు రావడంతో ఆయనపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

స్వచ్ఛందంగా పలువురు రాజీనామా

చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలం కుప్పిగానిపల్లి పంచాయతీ పరిధిలోని 14 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రత్యక్షంగా ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదనే నిబంధన ఉండడం వల్ల తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి ఎన్నికల్లో పాల్గొంటామని వలంటీర్లు తెలిపారు. రాజీనామా పత్రాలను ఎంపిడిఒకు వారు అందజేశారు.

నేడు ఎపి లా సెట్, పిజి లా సెట్ నోటిఫికేషన్

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

ఆంధ్రప్రదేశ్‌లో న్యాయ శాస్త్ర కోర్సుల్లో ప్రవేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఎపి లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్, ఎపి పోస్ట్ గ్రాడ్యుయేషన్ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2024 నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేస్తామని లాసెట్-2024 చైర్మన్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ పి.రాజశేఖర్, కన్వీనర్ ప్రొఫెసర్ బి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు వివరాలను వర్సిటీలోని లాసెట్ కార్యాలయంలో గురువారం వెల్లడించారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బి కోర్సు, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బి కోర్సు, రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు ఈ నెల 26వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 25 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. రూ.500 అపరాధ రుసుంతో ఏప్రిల్ 26 నుంచి మే 3వ తేదీ వరకు, రూ.వెయ్యి అపరాధంతో మే 4 నుంచి 11వ తేదీ వరకు, రూ.2 వేల అపరాధ రుసుముతో మే 12 నుంచి 20 వరకు, రూ.3 వేల అపరాధ రుసుంతో మే 21 నుంచి 29 వరకు దరఖాస్తు చేసుకునే వీలుందని వెల్లడించారు. దరఖాస్తులలో మార్పులు చేసుకునేందుకు మే 30 నుంచి జూన్ 1వ తేదీ వరకు అవకాశం ఉంటుందని, జూన్ 3 నుంచి హాల్ టికెట్లను అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. జూన్ 9న మధ్యాహ్నం 2:30 నుండి 4 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో పరీక్ష, 10న కీ విడుదల, 11, 12 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరిస్తామని వెల్లడించారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బి కోర్సుకు 10ం 2ం 3, యూజీ కోర్సులు ఉత్తీర్ణత సాధించిన వారు, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బి కోర్స్‌కు ఇంటర్మీడియట్, 10ం 2 కోర్సు పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. రెండేళ్ల ఎల్‌ఎల్‌ఎమ్ కోర్సుకు మూడేళ్ల ఎల్‌ఎల్‌బి కోర్స్ లేదా ఐదేళ్ల ఎల్‌ఎల్‌బి కోర్సు పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. 120 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, 35 శాతం మార్కులు సాధించిన వారు అర్హత సాధిస్తారని తెలిపారు. దరఖాస్తులకు సంబంధించిన పూర్తి వివరాలను cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సెట్ కన్వీనర్ సత్యనారాయణ సూచించారు.

రూ.115 కోట్లతో వేసవి తాగునీటి ప్రణాళిక

- జూన్ వరకూ అందించేందుకు చర్యలు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వేసవి నీటి ఎద్దడిని అధిగమించేందుకు రూ.115 కోట్ల అంచనాతో వేసవి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి వెల్లడించారు. జూన్ ఆఖరు వరకు రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. వెలగపూడిలోని సచివాలయంలో పంచాయతీరాజ్, మున్సిపల్, గ్రామీణ నీటిసరఫరా విభాగాల అధికారులతో సిఎస్ గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణాలు చివరి దశకు వచ్చిన మంచినీటి పథకాలన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులన్నిటినీ పూర్తిస్థాయిలో నీటితో నింపాలని సూచించారు. బోర్ వెల్స్, ఇతర తాగునీటి వనరులకు సంబంధించి స్టోరేజీలకు మరమ్మతులు చేపట్టాలని, శివారు కాలనీలకు, ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. కుళాయిల ద్వారా రోజుకు ఒక్కసారైనా మంచినీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా మంచినీటికి ఇబ్బంది కలిగితే 1904 కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి, తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు కూడా తాగునీటికి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ.. నీటి ఎద్దడి గల 1,354 ఆవాసాలకు జూన్ వరకూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. కరువు మండలాల్లో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మున్సిపల్ పరిపాలనా శాఖ కమిషనరు శ్రీకేశ్ బాలాజీరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో 47 పట్టణాల్లో రోజుకు ఒకసారి, 29 పట్టణాల్లో రోజుకు రెండు సార్లు, 43 పట్టణాల్లో రెండు రోజులకు ఒకసారి చొప్పున మంచినీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. కడప, పెనుగొండ, ఒంగోలు, హిందూపూర్‌లలో మూడు రోజులకు ఒకసారి మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, కెవివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మాటలు బూటకం : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం హామీలు అమలు చేశామని బూటకపు మాటలు చెబుతున్నారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. నారా లోకేష్ బుధవారం ఎక్స్ (ట్విట్టర్)లో చేసిన ట్వీట్‌ను గురువారం చంద్రబాబు రీ ట్వీట్ చేశారు. ప్రతిపక్ష నేతగా ఇచ్చిన 99 హామీలను ప్రస్తావిస్తూ చంద్రబాబు వీడియో విడుదల చేశారు. మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్న జగన్ గత హామీలపై బదులిచ్చాకే బస్సెక్కాలని అన్నారు. ఐదేళ్ల పదవీ కాలాన్ని విధ్వంసాలకు, కక్ష రాజకీయాలకు, దోపిడీకి వెచ్చించారని పేర్కొన్నారు.

సిఇఒకు లేఖ

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ తమ పార్టీ అభ్యర్థి రామాంజనేయులుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎంకె మీనాకు గురువారం లేఖ రాశారు. ప్రత్తిపాడు వైసిపి అభ్యర్థి కిరణ్ కుమార్ తన ఇంట్లో ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాలకు చెందిన వలంటీర్లతో గురువారం సమావేశమయ్యారని, సమాచారం తెలుసుకుని అక్కడకు వెళ్లిన రామాంజనేయులుపై కిరణ్ దాడి చేయించారని పేర్కొన్నారు.

జగన్ నిర్లక్ష్యంతో ఆరోగ్య విపత్తు : ఆలపాటి

జగన్ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో వైద్య విపత్తు తలెత్తిందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పిహెచ్‌సిల్లో వైద్యులు, సిబ్బంది లేరని అన్నారు. ఎన్నికల నియామవళిని ధిక్కరించిన అధికార భాషా సంఘం అధ్యక్షులు పి విజయబాబు, సజ్జల రామకృష్ణారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. చంద్రబాబుపై నిరాధార నిందలతో పుస్తకం రాశారని అన్నారు. ఐదేళ్లలో జగన్ రూ.1.14 లక్షల కోట్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించారని టిడిపి అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్ కుమారుడు దేవాన్ష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. ఓ ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలో అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన నవ్య (18) సిఎస్ఇ మొదటి సంవత్సరం చదువుతు న్నారు. గురువారం ఉదయం కళాశాలలో నిర్వహించిన పరీక్ష రాసిన అనంతరం ఆరోగ్యం సరిగా లేదని పర్మిషన్ తీసుకుని హాస్టల్‌కు నవ్య వచ్చారు. తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సాయంకాలం తోటి విద్యార్థులు హాస్టల్‌కు వచ్చారు. గది తలుపులను ఎంతసేపటికి తీయకపోవడంతో కిటికీలోనూంచి చూశారు. ఫ్యాన్‌కు వేలాడుతూ నవ్య కనిపించడంతో కళాశాల యాజమాన్యానికి విషయం తెలియజేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సమాజం మేలు కోరేదే కవిత్వం

- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

ప్రజాశక్తి - పాణ్యం (నంద్యాల)



సమాజం మేలు కోరేదే కవిత్వమని ప్రముఖ కవి, గాయకుడు, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా గురువారం నంద్యాల జిల్లా పాణ్యంలోని ఆర్‌జిఎం ఇంజనీరింగ్ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గోరటి వెంకన్న మాట్లాడుతూ.. రవిగాని చోట కవిగాంచునన్న నానుడి నిజమన్నారు. నేటి సమాజానికి కవిత్వం ఎంతో అవసరమని, దుర్మార్గాన్ని, దౌర్జన్యాన్ని, అమానుషత్వాన్ని కవి హృదయం అంగీకరించదన్నారు. కవులను కాపాడుకున్నప్పుడే సమాజ శ్రేయస్సు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచ గతిని, స్థితిని మార్చే శక్తి ఒక కవిత్వానికే ఉందన్న నిజాన్ని ఎందరో కవులు నిరూపించారని తెలిపారు. కన్యాశుల్కం లేకుంటే ముదుసలికి కన్యను ఇచ్చి పెళ్లి చేసే విధానం రద్దు అయ్యేదే కాదన్నారు. శ్రీశ్రీ మరుభూమి లేకుంటే రాజరికం మెడలు వంచేది కాదన్నారు. ఇటువంటి ఎందరో కవులు సమాజాన్ని మార్చి లోకహితం చాటారన్నారు. అనంతరం గోరటి వెంకన్నను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

తప్పుడు ప్రచారమే : ఒప్పుకున్న రాందేవ్ బాబా

- సుప్రీంకోర్టుకు క్షమాపణలు



న్యూఢిల్లీ : ప్రముఖ కార్పొరేట్ వ్యాపారి, యోగా గురు రాందేవ్ బాబాకు చెందిన పతంజలి ఆయుర్వేద సంస్థ జారీ చేసిన తప్పుడు ప్రకటనలపై క్షమాపణలు చెప్పింది. వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేసినందుకుగాను క్షమాపణలు కోరుతూ గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. దీంతో ఇంతకాలం జారీ చేసిన తప్పుడు ప్రచారాన్ని రాందేవ్ బాబా అంగీకరించినట్లయ్యింది. తప్పుదోవ పట్టించే ప్రకటనల జారీపై రాందేవ్ బాబా తదుపరి విచారణకు స్వయంగా హాజరు కావాలని మంగళవారం అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాము జారీ చేసిన షోకాజ్ కంటెప్ట్ పిటిషన్‌కు వివరణ ఇవ్వడానికి వ్యక్తిగతంగా హాజరు కావాలని న్యాయమూర్తులు హిమాకోహ్లీ, అహ్సనుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. డ్రగ్స్ అండ్ రెమెడిక్స్ యాక్ట్ 1954లోని 3,4 సెక్షన్లను రాందేవ్ బాబాతో పాటు పతంజలి ఆయుర్వేద్ సిఇఒ ఆచార్య బాలకృష్ణ ఉల్లంఘించినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు లభించడంతో అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆధునిక వైద్య విధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ 2022లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారిస్తున్న అత్యున్నత న్యాయస్థానం అసత్య ప్రచారాలను వెంటనే నిలిపేయాలంటూ పతంజలి గ్రూపును గతంలోనే సుప్రీంకోర్టు ఆదేశించింది. లేదంటే కోర్టు తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇకపై ఎలాంటి ఉల్లంఘనలూ జరగవంటూ అప్పట్లో సంస్థ తరపున న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. అయితే ఆ హామీలను సంస్థ విస్మరించింది. దీనిపై కోర్టు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసింది.

బాలుడిపై సామూహిక లైంగిక దాడి

ప్రజాశక్తి - బెల్లం కొండ (పల్నాడు జిల్లా)

బాలుడిపై సామూహిక లైంగిక దాడికి ఒడిగట్టిన ఘటన పల్నాడు జిల్లాలో గురువారం వెలుగు చూసింది. మిర్చి కోతల నిమిత్తం బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన కొన్ని కుటుంబాలు పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం వెంకటపాలేనికి ఇటీవల వచ్చాయి. ఈ క్రమంలో మంగళవారం పెద్దవారంతా పనులకు వెళ్లగా 12 ఏళ్ల బాలుడితో పాటు మరో ముగ్గురు ఇంటి వద్దే ఉన్నారు. సాయంత్రానికి బాలుడికి రక్తం వస్తుండడంతో కుటుంబ సభ్యులు ఆరా తీయగా విషయం బయటపడింది. వైద్య పరీక్షల నిమిత్తం బాలుడిని సత్తెనపల్లిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుని తండ్రి ఫిర్యాదు మేరకు బెల్లంకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురిని నిందితులుగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

బిజెపి రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జులుగా అరుణ్ సింగ్, సిద్ధార్థనాథ్ సింగ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల కోసం అరుణ్ సింగ్, సిద్ధార్థ్‌నాథ్ సింగ్‌లను బిజెపి ఇన్‌ఛార్జ్, కో-ఇన్‌ఛార్జులుగా నియమించింది. బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా నియమించినట్లు గురువారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ప్రకటన విడుదల చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు అరుణ్ సింగ్ ఇన్‌ఛార్జిగా, ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సిద్ధార్థ్‌నాథ్ సింగ్‌ను కో-ఇన్‌ఛార్జిగా నియమించినట్లు తెలిపారు.

రెండు రోజుల్లో అన్నీ సర్దుకుంటాయి

- తిరుపతి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులే : లోకేష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, పోరుమామిళ్ల



శ్రీవారి సేవలో నారా లోకేష్ కుటుంబం

తిరుపతి రాజకీయ పరిణామాలపై తనకు పూర్తిగా అవగాహన ఉందని, రెండ్రోజుల్లో అన్ని సర్దుకుంటాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా గురువారం తిరుమల శ్రీవారి దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన నారా లోకేష్‌ను తిరుపతి టిడిపి నాయకులు సుగుణమ్మ, నరసింహయాదవ్ కలిశారు. అనంతరం టిడిపి కూటమి ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కలిశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ తిరుపతి రాజకీయ పరిణామాలపై నాకు పూర్తి సమాచారం ఉందని, రెండురోజుల్లో అన్నీ సర్దుకుంటాయన్నారు. తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులేనని స్పష్టం చేశారు. తిరుపతి నియోజకవర్గం ప్రజలతో మమేకమై ప్రచారాన్ని ఉధృతం చేయాలని శ్రీనివాసులుకు లోకేష్ దిశా నిర్దేశం చేశారు.

సుగుణమ్మకు లోకేష్ క్లాస్

తిరుపతి జనసేన అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరిన సుగుణమ్మకు నారా లోకేష్ క్లాస్ తీసుకున్నట్లు సమాచారం. రాజకీయాలలో ఇలాంటివి సహజమేనని, పార్టీ అధికారంలోకి వస్తే తగిన గుర్తింపు ఇస్తామని, పొత్తు ధర్మంగా జనసేన అభ్యర్థికి మద్దతివ్వాలని సూచించినట్టు తెలిసింది.

దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

లోకేష్ కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా శ్రీవారి సేవలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రంలో రూ. 38 లక్షల విరాళాన్ని ఇచ్చారు. అన్నదాన సత్రంలో సందర్శకులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు.

జగన్ పాలన దోపిడీల పర్వమే:భువనేశ్వరి

జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన మొత్తం దోపిడీల పర్వంగానే కొనసాగిందని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి విమర్శించారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా ఆమె గురువారం వైఎస్ఆర్ జిల్లాలో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్లలో గుండెపోటుతో మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో ఎపిని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడితే, జగన్ పాలనలో కల్తీ మద్యం, ఇసుక దోపిడీ, భూ కబ్జాలు, గంజాయి, డ్రగ్స్, మహిళలపై దాడుల్లో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలబెట్టారని విమర్శించారు. ఎపికి రాజధాని లేకుండా చేసి రాష్ట్రం పరువు తీశారన్నారు. వైసిపి చేసే అరాచకాలను ధైర్యంగా తిప్పికొట్టి, 2024 ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో అవినీతి పాలనను అంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పాల్గొన్నారు.

సంపాదకీయం


చిత్తశుద్ధి 'క్షయం'

2025 సంవత్సరాంతానికి క్షయవ్యాధిని సమూలంగా నిర్మూలిస్తామని ఏడేళ్ల క్రితం బడ్జెట్ ప్రసంగంలో గొప్పగా ప్రకటించిన మోడీ ప్రభుత్వం... ఆ లక్ష్యసాధనకు ఆమడదూరంలో ఉంది. 2020 నాటికి పెట్టుకున్న మధ్యంతర మైలురాయిని కూడా చేరుకోలేకపోయింది. 204 దేశాల్లో జరిగిన సాంక్రమిత వ్యాధుల అధ్యయనం సారాంశాన్ని లాన్సెట్ జర్నల్ తాజాగా ప్రచురించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) నిర్దేశించిన లక్ష్యాలను భారత్ సహా చాలా దేశాలు సాధించలేకపోయాయని పేర్కొంది. 2035 నాటికి క్షయను నిర్మూలించాలనేది డబ్ల్యుహెచ్ఒ లక్ష్యం. 2015లో నిర్దేశించుకున్న ఈ మైలురాయికి అనుగుణంగా మన జాతీయ క్షయ నియంత్రణా పథకం 2017లో ఒక ప్రణాళికను రూపొందించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన విధంగా ఫలితాలను సాధించటానికి ప్రభుత్వం తగినన్ని నిధులు సమకూర్చాలని నివేదించింది. 2014 - 17 మధ్య కేటాయించిన రూ.3323 కోట్లు అంతంతమాత్రమేనని, ఆ మొత్తాన్ని ఐదు రెట్లు పెంచాలని కోరింది. ప్రభుత్వం నిధుల కేటాయింపును పక్కన పెట్టి, 2025 నాటికే నియంత్రణలో గణనీయమైన ప్రగతిని సాధిస్తామని మాత్రం పార్లమెంటులో ప్రగల్బాలు పలికింది. సాధించిన ఫలితాలను ఇప్పుడు మదింపు చేస్తే - పాలకుల పూనకమంతా మాటలకే పరిమితమని, తరువాతి బడ్జెట్ కేటాయింపుల్లో ఆ స్పృహ లేనేలేదని తేటతెల్లమైంది. 2020 నాటికి లక్ష జనాభాలో క్షయ సంక్రమణ 171 మందికే పరిమితం కావాలనేది లక్ష్యం కాగా, 213 కేసుల వరకూ నమోదయ్యాయి. ప్రతి ఏటా ప్రపంచంలో కోటీ 40 లక్షల కేసులు నమోదైతే, అందులో 27 శాతం మనదేశంలోవే! 18 లక్షల మంది మరణిస్తుంటే, అందులో 5 లక్షల 22 వేల మంది భారతీయులే! ఈ మరణాల సంఖ్యను 2020 నాటికి 2.7 లక్షలకు తగ్గించాలనేది మరొక లక్ష్యం. ఈ చావులను నియంత్రించటంలోనూ కేంద్ర ప్రభుత్వ ఉదాసీనత కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

క్షయవ్యాధి అనేది అనారోగ్యకరమైన వాతావరణానికి, పోషకాహార లోపానికి కొండగుర్తుగా భావించవొచ్చు. ఈ వ్యాధి ఉనికి, తీవ్రత, విస్తృతి, మరణాలూ ఆధారంగా ఆయా సమాజాల, దేశాల ఆరోగ్యం తీరుతెన్నులను అంచనా వేయవచ్చు! పేదరికం, కరువు, ఆకలి మూకుమ్మడిగా దాడి చేసే ఆఫ్రికా దేశాల్లో క్షయవ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కాలుష్యం ఆవరించిన చీకటి కుహరాల్లోనూ ఊపిరి తిత్తులను తినేసే ఈ మహమ్మారి తీవ్రంగా విరుచుకుపడుతుంది. అయితే, అలాంటి పరిస్థితులు మోహరించిన దేశాలు సైతం క్షయ నియంత్రణకు, నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలను చిత్తశుద్ధితో చేపడుతున్నాయి. లాన్సెట్ కథనం ప్రకారం ... చాలా ఆఫ్రికన్ దేశాలు వ్యాధి కట్టడిలో మెరుగైన ఫలితాలను సాధించాయి. మాల్దోవా, ఈక్వెడార్ లాంటి దేశాలు సైతం సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేయడం, వ్యాధి బాధితులను గుర్తించి, క్రమం తప్పకుండా చికిత్సను అందించటం ద్వారా క్షయవ్యాధిని గణనీయంగా నియంత్రించగలుగుతున్నాయి.

ఒకపక్క సంపన్నులు పెరుగుతుంటే- అంతకంతకు జీవన ప్రమాణాలు దిగజారిపోతున్న కోట్లాదిమంది ప్రజలు ఉన్న దేశం మనది. ఉపాధి అవకాశాలు తగ్గిపోయేకొద్దీ కుటుంబ సభ్యులకు అందే పోషకాహారం అడుగంటుకుపోతుంది. వివిధ కారణాల చేత దేశంలో వాతావరణ కాలుష్యం పెరిగిపోతూ ఉంది. జీవించటానికి వీలు కాని కలుషిత ప్రదేశాల్లో బతుకుతున్నవారు కోట్లలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో క్షయ వంటి దీర్ఘకాలిక రుగ్మతను అరికట్టటానికి పాలకులు చిత్తశుద్ధితో పనిచేయాలి. జాతీయ వ్యూహాత్మక ప్రణాళిక (ఎన్ఎస్‌పి)లో పేర్కొన్నట్టుగా, "ఇప్పటివరకూ అమలు చేస్తున్నది సరిపోదు. నిధులను కనీసంలో కనీసం ఐదు రెట్లు పెంచాలి." "పూర్తిగా నిర్మూలన లక్ష్యాన్ని సాధించాలంటే- మాటలు చెబితే సరిపోదు. కనీసం 40 ఏళ్ల పాటు కొత్తగా ఒక్కరు కూడా క్షయ బారిన పడకుండా చూడాలి. ఈలోగా పాత రోగులకు చికిత్స కొనసాగిస్తూనే, కొత్త వ్యాక్సిన్లను, నివారణోపాయాలను కనుక్కోవాలి." అన్న డబ్ల్యుహెచ్ఒ ఉన్నతాధికారి సౌమ్యా స్వామినాథన్ మాటలు ఆచరణీయాలు.

మంచి మాట




సోషలిజానికి సార్వజనీన మార్గాలు, సార్వజనీన నమూనాలు అంటూ ఏమీ లేవు. ఆయా దేశాల గడ్డలపై గల నిర్దిష్ట పరిస్థితుల్లో, నిర్దిష్ట కాలమానాల్లో సోషలిజం పెరగాలి.

- శ్యామ్ వెబ్,
అమెరికా కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన బాండ్లు

విశ్లేషణ

విరాళాలు పొందడం కోసం బిజెపి రెండు వినాశకర పద్ధతులను అనుసరించింది. ఒకటి-ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రకృతి సంపదను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం, ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టడం. ఇది క్విడ్ ప్రో కో పద్ధతి. 'నీకు ఇంత, నాకు అంత' అనేది ఈ విధానం. రెండు-రాజ్యాంగబద్ధ సంస్థలైన ఇ.డి, సిబిఐ, ఆదాయ పన్ను శాఖలను దుర్వినియోగం చేయడం. ఇందులో దాడులు-విరాళాలు అనే పద్ధతిని నీతిబాహ్యంగా మేళవించింది. అక్రమంగా పొందిన ఈ డబ్బుతో ఒకవైపు ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడానికి, ఎన్నికైన ప్రత్యర్థి పార్టీల ప్రభుత్వాలను కూల్చడానికి వినియోగించారు. అందుకే మోడీ పాలనా కాలంలో 13 రాష్ట్రాల్లో ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాల స్థానంలో బిజెపి పాలించగలిగింది. మరికొన్ని రాష్ట్రాల్లో అలా పాలించడానికి నిత్యం బెదిరింపులకు తెగబడుతున్నది. మరోవైపు మతం, ధర్మం పేరుతో ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి రూ.వేల కోట్లను విచ్చలవిడిగా ఖర్చు చేయగలుగుతున్నది.





వి. రాంభూపాల్

దేశంలో కార్పొరేట్ కంపెనీలకు, పాలక పార్టీలకు మధ్య రహస్య ఆర్థిక బంధం ఎంత బలంగా పెనవేసుకుందో ఎన్నికల బాండ్ల వ్యవహారం కొంతైనా బట్టబయలు చేసింది. నీతి, జాతి, దేశభక్తి, దైవభక్తి లాంటి మాటల గారడీల వెనుక దేశ పాలకులు జరిపిన కుతంత్రాలు సుప్రీంకోర్టు తీర్పుతో కొన్ని వెలుగులోకి వచ్చాయి. నల్లడబ్బు వెలికితీత, అవినీతి అంతం అనే పదాలకు ఇ.డి, ఐ.టి దాడులకు, సోదాలకు అర్థాలు వేరులే అని రుజువైంది. దేశ ప్రజలకు వేల ధర్మోపదేశాలు (మన్ కీ బాత్) చేసిన స్వయం ప్రకటిత విశ్వగురువు ఏలుబడిలో ప్రజాస్వామ్యానికి ఎంత భయంకరమైన చీడ పట్టిందో తేటతెల్లమైంది.

ఇప్పటి వరకు ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైట్‌లో పెట్టిన ఎన్నికల బాండ్ల రెండు జాబితాల ప్రకారం రూ.16,492 కోట్ల విరాళాలు వివిధ రాజకీయ పార్టీల ఖాతాలకు చేరాయి. ఇందులో ఒక్క బిజెపికే రూ.8,250 కోట్లు దక్కాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనం చేయడం, అవినీతిని చట్టబద్ధం చేయడం, రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేయడం, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టడమనే బిజెపి దుష్ట పన్నాగంలో భాగమే 2017లో మనీబిల్లు రూపంలో వచ్చిన ఎలక్టోరల్ బాండ్ల విధానం. ఆ పార్టీ ఆశించినట్లుగానే వేల కోట్ల రూపాయలను సొంతం చేసుకుని ప్రజాస్వామ్య పునాదులను పెకిలించడానికి ప్రయత్నిస్తున్నది. ఈ విరాళాలు పొందడం కోసం బిజెపి రెండు వినాశకర పద్ధతులను అనుసరించింది. ఒకటి-ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రకృతి సంపదను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం, ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టడం. ఇది క్విడ్ ప్రో కో పద్ధతి. 'నీకు ఇంత, నాకు అంత' అనేది ఈ విధానం. రెండు-రాజ్యాంగబద్ధ సంస్థలైన ఇ.డి, సిబిఐ, ఆదాయ పన్ను శాఖలను దుర్వినియోగం చేయడం. ఇందులో దాడులు-విరాళాలు అనే పద్ధతిని నీతిబాహ్యంగా మేళవించింది. అక్రమంగా పొందిన ఈ డబ్బుతో ఒకవైపు ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడానికి, ఎన్నికైన ప్రత్యర్థి పార్టీల ప్రభుత్వాలను కూల్చడానికి వినియోగించారు. అందుకే మోడీ పాలనా కాలంలో 13 రాష్ట్రాల్లో ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాల స్థానంలో బిజెపి పాలించగలిగింది. మరికొన్ని రాష్ట్రాల్లో అలా పాలించడానికి నిత్యం బెదిరింపులకు తెగబడుతున్నది. మరోవైపు మతం, ధర్మం పేరుతో ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి వేల కోట్లను విచ్చలవిడిగా ఖర్చు చేయగలుగుతున్నది.

ఎన్నికలు-ఎన్నికల బాండ్ల విరాళాలు

కేంద్ర, రాష్ట్ర ఎన్నికల్లో బిజెపి భారీగా లబ్ధి పొందడానికి ఈ విధానం నేరుగా ఉపయోగపడింది. 2019లో బిజెపి తిరిగి రెండవసారి కేంద్రంలో అధికారంలోకి రావడానికి ఈ విధానం ఆ పార్టీకి బాగా తోడ్పడింది. 2019 ఏప్రిల్-మే నెలల మధ్యలో బిజెపి ఖాతాలోకి రూ.1,771.57 కోట్లు భారీ మొత్తం జమయ్యింది. ఆ సంవత్సరం ఒక్క ఏప్రిల్ నెలలోనే రూ.1,056.86 కోట్లు బిజెపి ఖాతాకు చేరడం వెనుక కార్పొరేట్ కంపెనీలకు, బిజెపి గెలుపుకు వున్న లంకె ఎంత బలమైనదో అర్థమవుతుంది. ఎన్నికల అనంతరం ప్రైవేటీకరణ వేగం పెరగడానికి, అడవులు, ఓడరేవులు, రోడ్లు, విమానాశ్రయాలు, గనులు పెద్ద ఎత్తున కార్పొరేట్ సంస్థల ఆస్తులుగా మారడానికి, బిజెపి గెలుపుకు ఈ ఆర్థిక సంబంధమే మూలం. అందుకే అదానీ లాంటి వారు ప్రపంచ కుబేరులుగా మారగలుగుతున్నారు. ఇది ఇంతటితో ఆగలేదు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా మోడీనే ప్రధాన పోటీదారుడుగా మారడం వెనుక రహస్యం కూడా ఈ బంధం కొనసాగింపులో భాగమే. 2021 జనవరి-ఏప్రిల్ మధ్య పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. వీటిని బిజెపి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల కాలంలో బిజెపికి రూ. 292 కోట్లు అందాయి. 2023లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరాం రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. ఆ సంవత్సరం జులై-డిసెంబర్ మధ్య రూ. 1,149 కోట్లు బిజెపికి చేరాయి. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగిన 2021 ఏప్రిల్, 2022 జనవరి, నవంబర్, 2023 ఏప్రిల్, అక్టోబర్, నవంబర్ నెలల్లో అత్యధిక విరాళాలను ఆ పార్టీ పొందింది.

బిజెపి తర్వాత ఎన్నికల బాండ్ల ద్వారా అత్యధికంగా లాభపడిన పార్టీ మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్. ఈ పార్టీ 2019 ఏప్రిల్-2024 జనవరి మధ్య పొందిన విరాళాల మొత్తం రూ.1,609.5 కోట్లు. ఆ రాష్ట్రంలో సుదీర్ఘ కాలం ప్రజాపాలన అందించిన కమ్యూనిస్టులను అధికారానికి దూరం చేయడం వెనుక దోపిడి వర్గాలతో పాటు, ఆధునిక కార్పొరేట్ కంపెనీల పాత్ర కీలకమైంది. అందుకే ఒక రాష్ట్రంలో మాత్రమే వున్న తృణమూల్ కాంగ్రెస్‌కు పెద్ద మొత్తంలో ఎన్నికల బాండ్ల విరాళాలు అందాయి. 2021లో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల సందర్భంగా అత్యధికంగా డబ్బు పోగేసుకున్న టిఎంసి ఆ రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా ఖర్చు చేసింది. ఎన్నికల ఫలితాల (2021 మే2) తర్వాత కూడా టిఎంసి పార్టీకి విరాళాల పరంపర కొనసాగింది. 2022లో రూ.468 కోట్లు, 2023లో రూ. 562 కోట్లు, 2024 జనవరి లో రూ.130 కోట్ల ఎన్నికల బాండ్ల విరాళాలు తృణమూల్ కాంగ్రెస్ ఖాతాలోకి చేరాయి.

కాంగ్రెస్ పార్టీకి అందిన ఎన్నికల బాండ్ల మొత్తం రూ.1,421.8 కోట్లు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఏప్రిల్-మే నెలల మధ్య రూ.168 కోట్ల విలువ చేసే ఎన్నికల బాండ్లు పొందగా, ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోవడంతో కార్పొరేట్ కంపెనీలు, విరాళాలు ఇచ్చే సంపన్నులు ఆ పార్టీ వైపు శీతకన్ను వేశాయి. అందుకే ఆ సంవత్సరం అక్టోబర్‌లో కేవలం 1.7 కోట్ల ఎన్నికల బాండ్లు మాత్రమే వచ్చాయి. అయితే మరలా రాష్ట్రాల ఎన్నికల్లో గెలుపు ఓటములను బట్టి విరాళాల పంపకం మారుతూ వచ్చింది. 2022 జనవరి-ఏప్రిల్ మధ్య పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా రూ.127 కోట్ల బాండ్ల విరాళాలు కాంగ్రెస్ పొందింది. అయితే ఈ రాష్ట్రాల్లో ఆ పార్టీ ఆశించినంత ఫలితాలను సాధించలేకపోవడంతో అదే సంవత్సరం అక్టోబర్‌లో రూ.37 కోట్ల విరాళాల స్థాయికి పడిపోయింది. మరలా 2022 డిసెంబర్ నెలలో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడంతో 2022 డిసెంబర్, 2023 ఏప్రిల్ మధ్య రూ.209 కోట్ల విరాళాలు కాంగ్రెస్ ఖాతాకు జమ అయ్యాయి. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల సందర్భంగా ఈ పార్టీకి 2023 అక్టోబర్‌లో రూ.401 కోట్లు, నవంబర్‌లో రూ.179 కోట్ల విరాళాలు అందాయి. ఇదే పద్ధతుల్లో తెలంగాణలో బిఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో వైసిపి, టిడిపి పార్టీలకు విరాళాలు వచ్చాయి.

ఎన్నికల బాండ్ల రూపంలో వివిధ పార్టీలకు అందిన విరాళాలు ఆయా పార్టీల మీద ప్రేమతోనో, అభిమానంతోనో వచ్చినవి కాదు. తమకు బాగా దోచి పెట్టగలిగిన పార్టీ అధికారంలోకి రావాలనే లక్ష్యంతోనో లేదా గెలిచిన పార్టీకి భారీ విరాళాలు ఇచ్చి తమకు అనుకూలమైన విధానాలను రూపొందించుకోవాలనే ఉద్దేశంతోనో కార్పొరేట్ కంపెనీలు ఇచ్చినట్లు స్పష్టంగా అర్థమవుతుంది.


ఇ.డి, ఐ.టి దాడులు-ఎన్నికల విరాళాలు

అవినీతి, అక్రమాలను అరికట్టాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్, సిబిఐ, ఇన్‌కంటాక్స్ శాఖలు పూర్తిగా అధికార పార్టీల సేవలో తరిస్తున్నాయనే విమర్శ చాలాకాలంగా వుంది. అయితే గత పది సంవత్సరాల నరేంద్ర మోడీ పాలనలో ఈ సంస్థలు ఎన్నడూ లేనంతగా దుర్వినియోగమయ్యాయి. ముఖ్యంగా ఈ సంస్థలు అవినీతి కార్యకలాపాలను అరికట్టేందుకు చేపట్టే చట్టబద్ధ దాడులు, సోదాలను కూడా తమకు నిధులను రాబట్టుకునేందుకు బిజెపి పెద్ద ఎత్తున వినియోగించుకుంది. అత్యధిక ఎన్నికల బాండ్ల విరాళాలు ఇచ్చిన ఫ్యూచర్ గేమింగ్ సంస్థపై 2022 ఏప్రిల్ నుండి 2023 మే మధ్య ఐదుసార్లు ఇ.డి దాడులు లేదా సోదాలు జరిగాయి. దాడులు జరిగిన ప్రతిసారీ ఈ సంస్థ ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసింది. రూ. 1,368 కోట్లను ఎన్నికల బాండ్ల విరాళాలను పిండేసింది. అనేక అక్రమాలకు పాల్పడినట్లు ప్రకటించింది. అయితే ఈ దాడులు జరిగిన ప్రతిసారీ ఈ సంస్థ ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది. వాటి విలువ రూ.1,368 కోట్ల ఎన్నికల బాండ్ల విరాళాలు. 2022 ఏప్రిల్ 1,2 తేదీలలో ఇ.డి దాడులు చేసిన వెంటనే అదే నెల 7వ తేదీ వంద కోట్ల విలువ చేసే ఎన్నికల బాండ్లను విరాళంగా ఇచ్చింది. తిరిగి ఇదే సంవత్సరం జులై నెలలో ఇ.డి సోదాలు చేసింది. వెంటనే అదే నెల 6వ తేదీ రూ.75 కోట్ల విరాళం, సెప్టెంబర్‌లో మరల సోదాలు, దాడులు జరిగాయి. అక్టోబర్ 6న రూ.105 కోట్ల ఎన్నికల బాండ్లను, 2023 ఏప్రిల్, మే నెలలో జరిగిన దాడుల తర్వాత రూ.213 కోట్ల ఎన్నికల బాండ్లను విరాళంగా ఇచ్చింది.

మెగా ఇంజినీరింగ్ మీద 2019 అక్టోబర్‌లో దాడులు ఐదు కోట్ల విరాళం, వేదాంత లిమిటెడ్ మీద 2020 మార్చి, ఆగస్టు నెలలో ఇ.డి, ఐ.టి దాడులు, రూ.161.75 కోట్ల ఎన్నికల బాండ్ల విరాళం, నవయుగ ఇంజినీరింగ్ ఆఫీసుపై 2018 అక్టోబర్‌లో దాడులు రూ.30 కోట్ల విరాళం, హెట్రో ఫార్మా గ్రూప్‌పై 2021 అక్టోబర్‌లో దాడులు రూ.40 కోట్ల విరాళం, డిఎల్‌ఎఫ్ గ్రూప్ పై మూడుసార్లు ఇ.డి సోదాలు రూ.50 కోట్ల విరాళం, రెడ్డీస్ ల్యాబ్‌పై 2023లో దాడులు రూ.21 కోట్ల విరాళం, షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌పై 2023 డిసెంబర్ 20న ఇ.డి, ఐ.టి దాడులు 2024 జనవరి 11వ తేదీన రూ.40 కోట్ల విరాళం. ఇలా ఒకటేమిటి 2019 నుండి ఇ.డి, ఐ.టి దాడులు చేసిన 21 కంపెనీల నుండి రూ.1,072.75 కోట్ల ఎన్నికల బాండ్ల విరాళాలు రాజకీయ పార్టీలకు అందాయి. వీటిలో అత్యధిక భాగం బిజెపి ఖాతాకు చేరాయి.

బిజెపి చెప్పే అవినీతి రహిత పాలన మేడిపండు లాంటిదని ఎన్నికల బాండ్ల పొట్ట విప్పితే దాని అసలు గుట్టు బయటపడుతుందనే స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా సుప్రీంకోర్టుకు వివరాలు ఇవ్వకుండా అడ్డుకునేందుకు సకల ప్రయత్నాలు చేసింది, చేస్తుంది. తన ఏలుబడిలో జరిగిన అంతులేని ఈ అవినీతికి ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిన పార్టీ మూడోసారి అధికారం కోసం పాకులాడుతున్నది. ఎన్నికల బాండ్ల ద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి, దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెట్టే బిజెపిని గద్దె దింపడమే ఆ పార్టీకి ప్రజలు విధించాల్సిన శిక్ష.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/



వ్లదిమిర్ పుతిన్ ఎన్నిక పూర్వరంగం !

వ్యాఖ్య

మార్చి 15 నుంచి 17 వరకు జరిగిన రష్యా ఎనిమిదవ అధ్యక్ష ఎన్నికలలో వ్లదిమిర్ పుతిన్ ఏకపక్షంగా విజయం సాధించారు. ప్రధాని లేదా అధ్యక్ష పదవిలో వరుసగా ఐదవసారి అధికార పీఠమెక్కి రికార్డు సృష్టించారు. పుతిన్ విజయం ఎన్నికలకు ముందే ఖరారైందని అంతర్జాతీయ మీడియా రాసింది. ప్రస్తుతం యావత్ రష్యన్లను జాతీయ భావాలు ప్రభావితం చేస్తున్నాయి. పుతిన్ అనుసరిస్తున్న ఆర్థిక, ఇతర విధానాల పట్ల దేశంలో జనమందరూ ఏకీభావంతో ఉన్నారని చెప్పలేంగాని 'నాటో' కూటమి తమను దెబ్బ తీసేందుకు ఉచ్చు బిగిస్తున్నదనే అంశంలో మాత్రం తరతమ తేడాలతో ఒకే వైఖరితో ఉన్నారనేందుకు తాజా ఎన్నికలే నిదర్శనం. పశ్చిమ దేశాల ప్రసార బాకాలు ఉక్రెయిన్ మీద జరుపుతున్న సైనిక చర్యను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఎంతగా ప్రచారం చేసినా అధ్యక్ష ఎన్నికల్లో 77.49 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొనటం ఒక రికార్డు. గత ఎన్నికల కంటే 9.95 శాతం పెరిగింది. నిజంగా జనాలలో వ్యతిరేకత, ఆసక్తి లేకపోతే పోలింగ్ బూత్‌లకే రారు.


ఉక్రెయిన్‌పై సైనిక చర్యతో పశ్చిమ దేశాలు రష్యాను మరింతగా ఒంటరిపాటు చేసేందుకు చూడటం, ఆంక్షలు విధించటం తెలిసిందే. తాజా ఎన్నికల పూర్వరంగమిదే. రష్యాను ఒక బూచిగా చూపటమే కాదు, పద్దెనిమిదివేల ఆంక్షలు విధించారు. ఉక్రెయిన్‌కు దగ్గరగా ఉన్న ఎనిమిది ప్రాంతాలపై నాటో, అమెరికన్ మద్దతుతో దాడులు చేశారు. ఉక్రెయిన్‌లోని రష్యన్ జాతి వారిని అణచివేసేందుకు పూనుకున్నారు. రష్యాను దెబ్బతీసేందుకు ఉక్రెయిన్ కేంద్రంగా నాటో కూటమి దేశాలు జీవాయుధాలను తయారు చేస్తున్నట్లు విశ్వసనీయమైన సమాచారం ఉన్న తరువాత రష్యా గద్దె మీద ఉన్న వారెవరైనా ఆ ముప్పును ఎదుర్కోవాల్సిందే. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో కొన్ని జాతులను సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టి యుద్ధంలో ఎలా ఉపయోగించుకున్నారో అదే జాతులను ఇప్పుడు రష్యాకు వ్యతిరేకంగా సమీకరించటాన్ని చూసిన సామాన్య రష్యన్ పౌరులు మరోసారి తమకు ఫాసిస్టు ప్రమాదం ముంచుకువస్తున్నదని భావిస్తున్నారు. ఇదే అభిప్రాయం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న రష్యన్ కమ్యూనిస్టులలో కూడా ఉన్నకారణంగానే ఉక్రెయిన్‌పై సైనిక చర్యను సమర్థించారు. దీని అర్థం పుతిన్ విధానాలన్నింటినీ సమర్థిస్తున్నట్లు కాదు. అందుకే ఉక్రెయిన్‌పై సైనిక చర్యను వ్యతిరేకించిన శక్తులను దేశ వ్యతిరేకులుగా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ ఎన్నికలలో మొత్తం నలుగురు పోటీ చేస్తే పుతిన్‌కు 87.28 శాతం రాగా రెండవ స్థానంలో ఉన్న కమ్యూనిస్టు నేతకు 4.31 శాతం ఓట్లు వచ్చాయి.

ధనిక దేశాల కూటమిలో చేరేందుకు ఉవ్విళ్లూరిన పుతిన్ గతం దాస్తే దాగేది కాదు. అయితే వాటి మధ్య తలెత్తిన వైరుధ్యాలు ఈ రూపం సంతరించుకుంటాయని మూడు దశాబ్దాల క్రితం ఎవరూ ఊహించలేదు. నయా ఫాసిస్టు శక్తులు, వాటిని వ్యతిరేకించే శక్తుల మధ్య వైరంగా చూసినపుడు అంతర్జాతీయ రాజకీయాల్లో పుతిన్‌ను పురోగామి శక్తులు సమర్థిస్తున్నాయి. జాతీయ భావాలు అంటే రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు జర్మనీలో హిట్లర్ గ్యాంగ్ రెచ్చగొట్టిన జర్మన్ ఆధిపత్యవాదానికి, తమ దేశాన్ని కాపాడుకోవాలన్న రష్యన్ల భావనకు తేడా ఉంది. వ్లదిమిర్ పుతిన్ పురోగామి వాద, ప్రజాస్వామ్య పరిరక్షకుడో అని కితాబు ఇవ్వాల్సిన అవసరం లేదు. పూర్వపు సోవియట్ యూనియన్ వ్యవస్థలో ప్రజల సంపదగా ఉన్నదానిని గత మూడు దశాబ్దాల కాలంలో కొందరు ఆశ్రితులు, ప్రైవేటు పరం చేసిన వ్యవస్థ ప్రతినిధి పుతిన్. అయితే చమురు, సహజ వాయువు వంటి అపార సంపదలు ఇంకా ప్రభుత్వ రంగంలోనే ఉన్నప్పటికీ పూర్తిగా పెట్టుబడిదారీ వ్యవస్థ వైపే అడుగులు పడుతున్నాయి. రష్యాకు ఉన్న సహజ సంపదలు, మిలిటరీ, ఆయుధాల కారణంగా అది తమకు ఎక్కడ పోటీకి వస్తుందో అన్న భయంతో అమెరికా, ఐరోపా లోని ధనిక దేశాలు అడ్డుకొనేందుకు చూడటమే రష్యాతో వాటికి ఉన్న ప్రధాన వైరుధ్యం. ధనిక దేశాల కూటమి జి-7 లోకి రాకుండా ముందు చూశారు. తరువాత చేర్చుకొని, తిరిగి పక్కన పెట్టారు. నాటోను విస్తరించి రష్యా ముంగిట ఉన్న ఉక్రెయిన్‌ను మిలిటరీ కేంద్రంగా మార్చి అదుపు చేయాలన్న ఎత్తుగడను పుతిన్ జయప్రదంగా వమ్ముచేశాడు. గతంలో రష్యా ప్రాంతంగా ఉండి సోవియట్ హయాంలో ఉక్రెయిన్ రిపబ్లిక్‌లో ఉన్న క్రిమియా ప్రాంతాన్ని 2014లో తిరిగి స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి రష్యాలో జాతీయ భావాలు మరింతగా పెరిగాయని చెప్పవచ్చు. ప్రస్తుతం పుతిన్ బలం అదే!

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

డిగ్రీలు లేని ప్రిన్సిపాల్ !

స్మృతి



డా॥ దేవరాజు మహారాజు


కనీస విద్యార్హత లేకుండానే అధ్యాపకుడూ ప్రిన్సిపాలూ కావొచ్చా? అంటే వీలు కాదు. కానీ, కొందరు ఆ పరిధులు దాటుకుని, దీక్షతో నిరంతర కృషితో వాటిని సాధించగలుగుతారు. అలాంటి అరుదైన జీవితం-వ్యక్తిత్వం గలవాడు మన తెలుగు వారిలోనే ఒకరున్నారు. నాలుగో తరగతితో చదువు ఆపేసి, స్వయంకృషితో ఉన్నత విద్యావంతుడయ్యారు. ఒక జర్నలిజం స్కూలుకు చాలా కాలం ప్రిన్సిపాల్‌గా కొనసాగారు. ఆయనే రాంభట్ల కృష్ణమూర్తి (24 మార్చి 1920 - 7 డిసెంబరు 2001). ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రముఖ జర్నలిస్టులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా గురువు లేదా గురుతుల్యులు. ప్రగతిశీల సాహిత్యోద్యమ పునాది నిర్మాణానికి ఒక్కొక్క రాయి పేర్చిన అభ్యుదయ కాముకుడు.

తూర్పు గోదావరి జిల్లా, అమలాపురం తాలూకా అనాతవరం గ్రామంలో జన్మించిన రాంభట్ల స్వయంగా ఇంగ్లీషు, ఉరుదూ, తెలుగు, సంస్కృత భాషలు నేర్చుకున్నారు. ఆ యా భాషల్లోని అనేకానేక గ్రంథాలు అధ్యయనం చేశారు. ముఖ్యంగా ఒకవైపు సంప్రదాయ గ్రంథాల మీద, మరోవైపు ఆధునిక సాహిత్య ధోరణుల మీద సమానంగా పట్టు సాధించారు. చిన్నచిన్న పనులు చేస్తూ, స్వంత వ్యాపారాలు ప్రారంభించి ధనవంతులైన వారిని మనం చాలా మందిని చూడగలం. కానీ, స్వయంకృషితో ఇంత పెద్ద ఎత్తున విద్యాధనమార్జించిన పండితుల్ని చూడలేం. వేదాల్ని, ఉపనిషత్తుల్ని, దర్శనాల్ని క్షుణ్ణంగా చదివి, వాటి ప్రభావంలో పడి, ఒక ఛాందసవాదిగా మారిపోకుండా నిలదొక్కుకుని, అభ్యుదయవాదిగా నిలబడగలగడం చాలా గొప్ప విషయం. 1943లో హైదరాబాదు లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయానికి కార్యదర్శి అయి, అదే సమయంలో ఒక ఐదేళ్ళ పాటు 'మీజాన్' పత్రికలో పని చేశారు రాంభట్ల! 1946లో తొలి తరం జర్నలిస్టుల జీతాల పెంపు కోసం సంఘర్షించారు. 1948లో మద్రాసులోను విజయవాడలోనూ పలు పత్రికల్లో పనిచేశారు. 1952లో విశాలాంధ్ర పత్రికకు సబ్ ఎడిటర్ అయ్యారు. ఆ రోజుల్లోనే కార్టూన్లు వేయడం, కార్టూన్ కవితలు రాయడం ప్రారంభించారు. తెలుగు జర్నలిజంలో అవే తొలి ప్రయత్నాలు.

కవి రాక్షస, అగ్నిమిత్ర, కృష్ణ-పేర్లతో ఆరోజుల్లో కనిపించిన రచనలన్నీ రాంభట్ల కృష్ణమూర్తివే!! అవన్నీ ఆయన కలం పేర్లు. జర్నలిస్ట్ గనక పత్రికలకు రాయడం మామూలుగా జరిగేదే. కానీ, అంతకు మించి అనేక విషయాల మీద ఆయన ఎన్నో గ్రంథాలు ప్రకటించారు. జన కథ, వేల్పుల కథ, సొంత కథ, శశవిషానం, పాదుటాకులు వంటి గ్రంథాలు చాలా ప్రకటించారు. ఉరుదూ కవి ముగ్దూమ్ మొహియుద్దీన్ కవిత్వానికి ఆకర్షితులై ఆయన కవిత్వాన్ని తెలుగులోకి అనువదించారు. అలాగే కమ్యూనిస్టు అంతర్జాతీయ గీతాన్ని అదే బాణిలో, పాడుకోవడానికి అనువుగా అనువదించారు. ఇవన్నీ చేస్తూనే మరోవైపు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘానికి మార్గదర్శిగా నిలిచారు. 1973 గుంటూరులో, 1977 హైదరాబాదులో జరిగిన 'అరసం' రాష్ట్ర మహాసభల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నాటి యువతీ యువకుల మెదళ్ళలో అభ్యుదయ బీజాలు నాటి, వారిని రచనా రంగం వైపు నడిపించారు. ఆయన పరిశీలనల్లో, పరిశోధనల్లో ఎప్పుడూ కొత్త చూపు ఉండేది. కొత్త దారులు వేయడంలో ఆయనకు ఆయనే సాటి. చేసే కృషి ఏ రంగంలో దైనా, అన్నింటా మార్క్సిస్టు దృష్టి కోణాన్ని నిలుపుకోవడం ఆయన ప్రత్యేకత! ఈ విషయాలన్నిటినీ పొందుపరిచి 'దారి దీపం' మాసపత్రిక సంపాదకులు డి.వి.వి.ఎస్ వర్మ-రాంభట్ల కృష్ణమూర్తి శత జయంతి విశేష సంచికను వెలువరించారు. దానికి ఆర్వీ రామారావు గౌరవ సంపాదకులుగా వ్యవహరించారు.

తొలితరం జర్నలిస్ట్‌గా, తొలి కార్టూనిస్ట్‌గా, మార్క్సిస్టు మేధావిగా గుర్తింపబడ్డ రాంభట్ల ఏం రాశారోనని ఆయన రచనలు జాగ్రత్తగా పరిశీలించాను. అప్పుడు తెలిసింది ఆయన నిజంగానే విషయ పరిజ్ఞానం గలవారని! వేదాలు సృష్టి మొదలైనప్పుడే ఉన్నాయని, ఆ భగవంతుడే స్వయంగా మానవుడికి అందించాడని ఊదరగొట్టే వారికి రాంభట్ల వాక్యాలు కొన్ని చూపించదలిచాను. ఆయన ఇలా రాశారు. "మన వేద సమాజంలో జర్మన్ సమాజం ఛాయలు గోచరిస్తున్నాయని, వేదకాలం కన్నా ముందే ఈ దేశంలో వర్ధిల్లిన హరప్పా, మొహంజొదారో సమాజాల్లో ప్రాచ్య సమాజ లక్షణాలు పుష్కలంగా కనిపిస్తున్నాయ"ని జనకథలో ఒక చోట చెప్పారు. ఆధునిక పరిశోధనలు ధృవపరిచిన విషయాల్ని రాంభట్ల కృష్ణమూర్తి ఆ రోజుల్లోనే గ్రహించగలిగారు.

ఇంకా ఇలా రాశారు. "మొహంజొదారో సమాజ సంస్కృతుల ప్రభావం వేదాల మీద పడినట్లు వేదాల్లోనే యెన్నో ఆధారాలు కనిపిస్తాయి. ఇప్పుడు రామాయణం చదువుతూ ఉంటే-మొసపటేమియా, మొహంజొదారో



సమాజం ప్రభావం రామాయణంలో చాలా కనిపిస్తోంది. జుడిషియల్ బ్లయిండ్‌నెస్ తొలగిపోయిన తర్వాత మన సమాజం కొత్త కాంతులతో కొత్త తేజస్సుతో కనిపిస్తోంది. అందుచేత మార్క్సిజం వెలుగులో మన చరిత్రను తిరిగి చూద్దాం. మన సమాజాన్ని తిరిగి అర్థం చేసుకుందాం. మన కూకటి వేళ్ళను-రూట్స్‌ను-తిరిగి పట్టుకుందాం!" ఇది రాంభట్ల కృష్ణమూర్తి భావితరాలకు ఇచ్చిన సందేశంగా మనం పరిగణించాల్సి ఉంటుంది!

ఇలాంటి వారు ప్రచార ఆర్భాటాలకు దూరంగా ఉంటారు. తాము చేయదలచుకున్న పని నిశ్శబ్దంగా చేసుకుంటూ పోతారు. గొప్ప పదవుల్లో ఉండి కూడా చేసింది ఏమీ లేకపోయినా, నిస్సిగ్గుగా అంతర్జాతీయ అవార్డుల కోసం ప్రయత్నాలు చేసుకునే హీన మనస్కులు, మీడియా పిచ్చోళ్ళూ ఉన్న ఈ రోజుల్లో ఏమీ ఆశించకుండా ఎవరినీ పట్టించుకోకుండా సత్యాన్ని అన్వేషించే దిశగా నిరంతరం కృషి చేస్తున్న వారిని తప్పకుండా గుర్తించుకోవాలి! గౌరవించుకోవాలి.

/ వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత, జీవశాస్త్రవేత్త - మెల్బోర్న్ నుంచి /

ఐదు రాష్ట్రాల్లో ఎస్‌పి, మెజిస్ట్రేట్‌లు బదిలీ

- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) నాలుగు రాష్ట్రాల్లో జిల్లా ఎస్‌పిలను బదిలీ చేసింది. జిల్లా మెజిస్ట్రేట్, ఎస్‌పి హెూదాల్లో ఉన్న వారిని బదిలీ చేస్తూ సిఇసి గురువారం ఆదేశాలు జారీ చేసింది. గుజరాత్, పంజాబ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో బదిలీలు జరిగాయి. గుజరాత్‌లోని చోటా ఉదయ్‌పూర్, అహ్మదాబాద్ రూరల్ జిల్లా ఎస్‌పిలను, పంజాబ్‌లోని పఠాన్‌కోట్, ఫజిల్కా, జలంధర్ రూరల్, మలేర్‌కోట్లా జిల్లా ఎస్‌ఎస్‌పిలను బదిలీ చేశారు. అలాగే ఒరిస్సాలోని ధేన్‌కెనాల్ జిల్లా మెజిస్ట్రేట్, డియోగఢ్, కటక్ రూరల్ జిల్లా ఎస్‌పిల బదిలీకి ఆదేశాలిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లోని పూర్వ మిడ్నాపూర్, జార్‌గ్రామ్, పూర్వ బర్ధమాన్, బీర్భుమ్ జిల్లాలకు చెందిన జిల్లా మెజిస్ట్రేట్లను బదిలీ చేశారు. రాజకీయ ప్రజాప్రతినిధులకు బంధువులైన పంజాబ్‌లోని బటిండా ఎస్‌ఎస్‌పి, అస్సాంలోని సోనిట్‌పూర్ ఎస్‌పిని కూడా బదిలీ చేశారు.

ఇసి నియామక చట్టంపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ



న్యూఢిల్లీ : ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం-2023పై స్టే ఇవ్వడానికి సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది. ఈ చట్టాన్ని నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటీషన్లను విచారించిన సుప్రీంకోర్టు చట్టంపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ దశలో నిలిపివేస్తే అది తీవ్ర గందరగోళానికి, అనిశ్చితికి దారితీస్తుందని సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే దీనిపై ఇప్పుడు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది. అలాగే ఇటీవల ఎన్నికల కమిషనర్లుగా మాజీ ఐఎఎస్ అధికారులు జ్ఞానేశ్ కుమార్, సుఖ్బీర్ సింగ్‌లను నియమించడాన్ని కూడా ధర్మాసనం ప్రస్తావించింది. వీరిపై ఎలాంటి ఆరోపణలు లేవని పేర్కొంది. కొత్త చట్టం ప్రకారం ఇటీవల చేపట్టిన ఇసి నియామకాలపై స్టే ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు గురువారం కొట్టేసింది. ఇసిల నియామకం కోసం సిజెఐతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ 2023లో ఇచ్చిన తీర్పును గుర్తు చేస్తు పార్లమెంట్ చట్టం చేసే వరకే తాత్కాలిక కమిటీ అమల్లో ఉంటుందని స్పష్టం చేసినట్లు తెలిపింది. అయితే, కొత్త చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన ప్రధాన పిటిషన్లను విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. ఈ పిటీషన్లపై ఆరు వారాల్లోగా తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 5వ తేదీకి వాయిదా వేసింది.

తెలంగాణలో మరో ఐదు స్థానాలకు అభ్యర్థులు ఖరారు

- పెద్దపల్లి నుంచి వంశీకృష్ణ
- సికింద్రాబాద్ నుంచి దానం
- 57 మందితో కాంగ్రెస్ మూడో జాబితా

న్యూఢిల్లీ: త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు 57 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ పార్టీ గురువారం మూడో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో తెలంగాణలో ఐదు నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి గడ్డం వంశీకృష్ణ, మల్కాజిగిరి నుంచి సునీతా మహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్, చేవెళ్ల నుంచి రంజిత్ రెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవిని బరిలోకి నింపింది. గురువారం జాబితాలో అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిలోని కొన్ని నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. పశ్చిమ బెంగాల్‌లోని బహరామ్‌పుర్ నియోజకవర్గం నుంచి అధీర్ రంజన్ చౌదరీ బరిలో దిగనున్నారు. అలాగే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అల్లుడు రాధాకృష్ణ కర్ణాటకలోని గుల్బర్గా నుంచి, కేంద్ర మాజీ మంత్రి సుశీల్ కుమార్ షిండే కుమార్తె ప్రణితి షిండే మహారాష్ట్రలోని సోలాపూర్ నుంచి పోటీ చేయనున్నారు. గురువారం జాబితాతో కలిసి కాంగ్రెస్ ఇప్పటివరకు మొత్తం 139 మంది అభ్యర్థులను ప్రకటించింది.


చెన్నయ్ సౌత్ నుంచి తమిళిసై పోటీ

3వ జాబితా విడుదల చేసిన బిజెపి

న్యూఢిల్లీ : తెలంగాణ గవర్నరు పదవికి ఇటీవల రాజీనామా చేసి బిజెపిలో చేరిన తమిళి సై చెన్నయ్ సౌత్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు తమిళనాడులో 9 స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులతో బిజెపి మూడో జాబితాను గురువారం విడుదల చేసింది. అలాగే కోయంబత్తూరు నుంచి బిజెపి తమిళనాడు అధ్యక్షులు కె అన్నామలై పోటీ చేయనున్నారు. వీరితో పాటు చెన్నై సెంట్రల్ - వినోజ్ పి.సెల్వం, వెల్లూరు - డా ఎసి షణ్ముగం, కృష్ణగిరి - సి నరసింహన్ నీలగిరిస్ (ఎస్సీ) ఎల్ మురుగన్, పెరంబలూరు - టిఆర్ పార్వేందర్, తూత్తుకుడి - నైనార్ నాగేంద్రన్, కన్యాకుమారి - పొన్ రాధాకృష్ణన్ పోటీ చేయనున్నట్లు తెలిపింది. గతంలో 195 మందితో తొలి జాబితా, ఇటీవల 72 మందితో రెండో జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో మూడో జాబితాలో కలిపి మొత్తంగా 276 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది.

బిజెపికి నిధుల వరద

- నాన్ ఎలక్టోరల్ బాండ్లలోనూ 65 శాతం ఆ ఖాతాలోకే
- పదేళ్లలో ఏకంగా రూ.5000 కోట్ల నిధులు
- దర్యాప్తు సంస్థల సోదాల ఫలితమే అంటున్న విశ్లేషకులు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో ప్రజా వ్యతిరేక చర్యలతో, కార్పొరేట్ అనుకూల విధానాలతో వ్యవస్థలన్నిటినీ నాశనం చేస్తూ వస్తున్న బిజెపికి కార్పొరేట్ కంపెనీలు భారీగా నిధులు కుమ్మరించి కొమ్ముకాస్తున్నాయి. ఎన్నికల బాండ్లలో అత్యధిక నిధులు దక్కించుకున్న ఆ పార్టీ నాన్ ఎలక్టోరల్ బాండ్ల రూపంలోనూ మిగిలిన రాజకీయ పార్టీలు అన్నింటికంటే అత్యధిక నిధులను సొంతం చేసుకుంది. నాన్ ఎలక్టోరల్ బాండ్ల మొత్తం నిధుల్లో దాదాపు 65 శాతం (రూ.5000 కోట్లు) నిధులను బిజెపి వంశమయ్యాయి. ఈ నాన్ ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని కూడా 2003లో నాటి బిజెపి ప్రభుత్వమే తీసుకురావడం ప్రస్తావనర్హం. దీని ప్రకారం..రూ.20 వేలు అంతకంటే ఎక్కువ మొత్తంలో రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వాలంటే వాటిని బాండ్ల రూపంలో సమర్పించాల్సివుంటుంది. ఈ మొత్తానికి గాను సదరు కంపెనీలకు వంద శాతం పన్ను మినహాయింపు లభిస్తుంది.

కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) వద్ద ఉన్న సమాచారం ప్రకారం..2013-23 మధ్య రాజకీయ పార్టీలకు నాన్ ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.7,726 కోట్ల విరాళాలు అందుకున్నాయి. ఈ మొత్తంలో ఒక్క బిజెపికే రూ.5,000 కోట్లు (64.7 శాతం) నిధులు అందాయి. కాంగ్రెస్‌కు 10.7 శాతం, బిఆర్‌ఎస్‌కు 3.3 శాతం, ఆమ్ ఆద్మీ పార్టీ 3.1 శాతం విరాళాలు దక్కాయి. కాగా 2014లో రూ.309 కోట్ల నాన్ ఎలక్టోరల్ బాండ్ల వితరణ చేయగా..2020లో వీటి రూపంలో అందజేసిన విరాళాలు రూ.1,247 కోట్లకు చేరాయి. అయితే 2018 కేంద్రంలోని నరేంద్ర మోడీ నేతృత్వ బిజెపి ప్రభుత్వం ఎన్నికల బాండ్ల విధానానికి విస్తృత ప్రాచుర్యం కల్పించడంతో కంపెనీలన్నీ ఆ రూపంలో విరాళాలు సమర్పించేందుకు మొగ్గు చూపాయి. దీంతో నాన్ ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు 2023లో స్వల్పంగా క్షీణించాయి. ఆ ఏడాది కూడా రూ.1,101 కోట్ల మేర నాన్ ఎలక్టోరల్ బాండ్ల విరాళాలను కంపెనీలు సమర్పించుకున్నాయి. ఈ నాన్ ఎలక్టోరల్ బాండ్లు సమర్పించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన కొన్ని కార్పొరేట్ కంపెనీల గ్రూపు వేదిక 'ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ (పిఇటి)' గతేడాది బిజెపికి ఏకంగా రూ.256 కోట్లు సమర్పించింది. బిజి షిర్కే కన్‌స్ట్రక్షన్స్ టెక్నాలజీ సంస్థ కూడా బిజెపికి రూ.35 కోట్లు అందజేసింది. తెలంగాణలో నాడు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ (ఇదివరకు టిఆర్‌ఎస్)కు కూడా పిఇటి రూ.90 కోట్లు విరాళంగా అందజేసింది. కాగా కాంగ్రెస్ పార్టీకి ఎంఎస్ ఎంకెజె ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ రూ.45 కోట్లు విరాళంగా అందజేసింది.

తీర్పు రిజర్వు చేసిన తర్వాత కూడా రూ.8,350 కోట్ల బాండ్ల ముద్రణ


న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగబద్ధతపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం 2023 నవంబరులో తీర్పును రిజర్వ్ చేసింది. తీర్పు అనుకూలంగా వస్తుందని గట్టి నమ్మకంతో ఉన్న బిజెపి ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ఒక్కోటి కోటి రూపాయల విలువైన 8,350 బాండ్లను ముద్రించింది. సమాచార హక్కు (ఆర్‌టిఐ) చట్టం కింద హక్కుల కార్యకర్త, మాజీ సైనికోద్యోగి కమాండర్ లోకేష్ బత్రా అడిగిన ప్రశ్నకు ఎస్‌బిఐ ఈ వివరాలు అందించింది. ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాలు అందుకున్న పార్టీల్లో బిజెపిదే అగ్రస్థానమన్న విషయం తెలిసిందే.

ఎన్నికల కమిషన్ ప్రచురించిన వివరాల ప్రకారం 2018 నుండి ఎన్నికల బాండ్ల ద్వారా బిజెపి ఖాతాకు రూ.8,251.8 కోట్లు చేరాయి. ఆ కాలంలో విక్రయించిన మొత్తం బాండ్ల విలువ రూ.16,518 కోట్లు. అంటే విక్రయించిన బాండ్లలో 50 శాతం బాండ్లను బిజెపి నగదుగా మార్చుకుంది. బాండ్ల ముద్రణ, నిర్వహణ ఖర్చు యావత్తూ పన్ను చెల్లింపుదారులే భరించారు. దాతలు కానీ, విరాళాలు అందుకున్న పార్టీలు కానీ పైసా కూడా వెచ్చించలేదు.

2018-23 మధ్యకాలంలో కమిషన్, ముద్రణ, ఇతర నిర్వహణ ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుండి ఎస్‌బిఐ రూ.13.50 కోట్లు వసూలు చేసింది. ఈ సంవత్సరం 8,350 బాండ్ల ముద్రణ, నిర్వహణ కోసం ఎంత ఖర్చు చేసిందీ తెలియరాలేదు. ఏదేమైనా ఈ మొత్తాన్ని భరించింది పన్ను చెల్లింపుదారులే.

సుప్రీంకోర్టు యథాతథస్థితిని కొనసాగిస్తుందని ప్రభుత్వం భావించిందని, అందుకే కోటి రూపాయల విలువ కలిగిన బాండ్లను ముద్రించిందని హక్కుల కార్యకర్త బత్రా వ్యాఖ్యానించారు.

కేజ్రీవాల్ అరెస్టు దుర్మార్గం : పినరయి విజయన్



న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టును కేరళ సిఎం పినరయి విజయన్ తీవ్రంగా ఖండించారు. అరెస్టు పూర్తిగా దుర్మార్గమైనదని, లోక్‌సభ ఎన్నికల ముందు అన్ని ప్రతిపక్ష పార్టీల గొంతును అణిచివేయడానికి ఒక పన్నాగంగా విజయన్ విమర్శించారు. అలాగే ఈ అరెస్టు ప్రజాస్వామ్య ప్రక్రియకు భయపడే వారి పిరికితనాన్ని వెల్లడిస్తుందని అన్నారు. అలాగే అధికార దుర్వినియోగాన్ని ఎదుర్కొవడానికి సమిష్టి చర్యలకు విజయన్ పిలుపునిచ్చారు.

ఖాతాలను స్తంభింపచేయడం నుంచి ముఖ్యమంత్రుల అరెస్టు వరకూ వెళ్లింది : రాహుల్ గాంధీ

దేశంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న నియంతృత్వం ఇప్పుడు ముఖ్యమంత్రుల అరెస్టు వరకూ వెళ్లిపోయిందని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ విమర్శించారు. మీడియాతో సహా అన్ని సంస్థలను గుప్పిటలోకి తీసుకోవడం, పార్టీలను విభజించడం, సంస్థలను నుంచి డబ్బులు వసూలు చేయడం, ప్రధాన ప్రతిపక్ష పార్టీల బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేయడం వరకూ చేసిన నియంతృత్వానికి అది సరిపోక ఇప్పుడు ముఖ్యమంత్రుల అరెస్టు వరకూ వెళ్లిందని రాహుల్ విమర్శించారు.

అధికారం కోసం బిజెపి ఎంతకు తెగిస్తుందో.. : శరద్‌పవార్

కేజ్రీవాల్ అరెస్టును నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకులు శరద్‌పవార్ తీవ్రంగా ఖండించారు. అధికారం కోసం బిజెపి ఎంతకు తెగిస్తుందో, ఎంత లోతుకు దిగుతుందో కేజ్రీవాల్ అరెస్టుతో అర్థమవుతుందని విమర్శించారు. 'ప్రతిపక్షా పార్టీలను వేధించడానికి కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేయడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ముఖ్యంగా లోక్ సభ ఎన్నికలు సమీపిస్తు వేళ అధికారం కోసం బిజెపి ఎంతకు తెగిస్తుందో ఈ అరెస్టుతో అర్థమవుతుంది. ఈ రాజ్యాంగ విరుద్ధ చర్యకు వ్యతిరేకంగా 'ఇండియా' వేదిక ఐక్యంగా నిలుస్తుంది' అని శరద్‌పవార్ తెలిపారు.

ఓటమి తప్పదన్న భయంతోనే : స్టాలిన్

'దశాబ్దపు వైఫల్యాలు, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయం' కారణంగానే కేజ్రీవాల్ అరెస్టు జరిగిందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విమర్శించారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ద్వారా ఫాసిస్ట్ బిజెపి ప్రభుత్వం జుగుప్సాకరంగా వ్యవహరించిందని ఆరోపించారు.

ఎస్‌బిఐవి కట్టుకథలు

- క్విడ్‌ప్రోకో ఆధారాలు ధ్వంసం
- సమాచారం ఉంటే అనుమానం ఎందుకు?
- సమాచారమే లేకపోతే సమయం కోరడం దేనికి?
- మాజీ ఎన్నికల కమిషనర్ లవాసా ప్రశ్నల వర్షం



న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల పథకం రూపకల్పన వెనుక ప్రభుత్వ ఉద్దేశాలపై మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లవాసా పలు సందేహాలు వ్యక్తం చేశారు. పలు విషయాల్లో భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బిఐ) కట్టుకథలు అల్లుతున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. గత సార్వత్రిక ఎన్నికల తర్వాత లవాసాపై మోడీ ప్రభుత్వం పలు వివాదాస్పద చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన 2019 ఆగస్టులో పదవి నుండి వైదొలిగారు. 2018లో తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల పథకంలోని సెక్షన్ 7 (4)లోని అంశాలను 'ది హిందూ' పత్రికకు రాసిన వ్యాసంలో లవాసా ప్రస్తావించారు.

'కొనుగోలుదారుడు అందజేసిన సమాచారాన్ని అధీకృత బ్యాంక్ ఏ అధికారికి కానీ, ఏ ప్రయోజనం కోసం కానీ ఇవ్వకూడదు. దీనిని గోప్యంగా ఉంచాలి. అయితే న్యాయస్థానం కోరినప్పుడు లేదా చట్టాన్ని అమలు చేసే సంస్థలు క్రిమినల్ కేసు నమోదు చేసినప్పుడు మాత్రం ఆ సమాచారాన్ని అందజేయాల్సి ఉంటుంది' అని ఆ సెక్షన్ స్పష్టంగా చెబుతోందని లవాసా తెలిపారు. కొనుగోలుదారుకు జారీ చేసిన బాండుపై ఉండే రహస్య నెంబరును చట్టప్రకారం బ్యాంక్ తన వద్ద అట్టే పెట్టుకోకూడదని బాండ్ల రూపకర్తలు కూడా చెప్పారు. అంటే దీని అర్థం కొనుగోలుదారుకు, బాండును స్వీకరించిన వారికి మధ్య ఉన్న సంబంధాన్ని బయటపెట్టడం దాదాపు అసాధ్యం. దీనిపై లవాసా వ్యాఖ్యానిస్తూ బాండుపై ఉండే నెంబరు దాని ప్రామాణికతను సరిపోల్చడానికి, ఆడిట్ అవసరాలకు మాత్రమే పరిమితమైతే అది కరెన్సీ వంటిదేనని చెప్పారు. 'దర్యాప్తు సంస్థకు అందజేయాలని ఒత్తిడి తెచ్చినప్పుడు కొనుగోలుదారుని గుర్తింపును ఎస్‌బిఐ ఎలా బయటపెడుతుంది? నిధుల వనరులకే విచారణ పరిధిని ఎలా పరిమితం చేస్తుంది? ఇది దాత, రాజకీయ పార్టీ మధ్య ఉన్న సంబంధాలను అందించే అవకాశాలను తోసిపుచ్చడం కాదా? తద్వారా క్విడ్‌ప్రోకో ఆరోపణలపై విచారణకు అవసరమైన కీలక ఆధారాలను నాశనం చేయడం కాదా? చట్టాన్ని అమలు చేయడం, న్యాయస్థానం, దర్యాప్తు సంస్థ పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించడం వంటి విషయాలలో ఎస్‌బిఐ కట్టుకథలు అల్లడం కాదా?' అని ప్రశ్నించారు.

'ఒకవేళ ఎస్‌బిఐ వద్ద రికార్డులు లేకపోతే బాండ్ల సమాచారాన్ని సేకరించేందుకు ఏ ప్రాతిపదికన సమయం కోరింది? దాతలతో రాజకీయ పార్టీలను, యూనిక్ నెంబరును సరిపోల్చే సమాచారం ఎస్‌బిఐ వద్ద లేనప్పుడు తన వద్ద వివరాలు ఉన్నాయని ఎలా చెప్పుకుంటుంది?' అని కూడా లవాసా నిలదీశారు. ఎంపీల సంఖ్య ఎక్కువగా ఉన్నందునే తమకు అధిక విరాళాలు అందాయంటూ బిజెపి నేతలు చేస్తున్న వాదనను ఆయన కొట్టిపారేశారు. బిజెపి వైవిధ్యభరితమైన పార్టీ అంటూ వారు ఇస్తున్న నిర్వచనాన్ని కూడా లవాసా ఎద్దేవా చేశారు.

క్రెడిట్ కార్డులపై రివార్డులకు కోత

ఏప్రిల్ నుంచి కొత్త నిబంధనలు • పలు బ్యాంకుల ప్రకటన

ముంబయి : క్రెడిట్ కార్డుల వినియోగించినప్పుడు లభించే ప్రోత్సాహక రివార్డులకు బ్యాంకులు కోత విధించనున్నాయి. ఈ మేరకు వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశాయి. రివార్డులతో పాటు, ఎయిర్‌పోర్టు లాంజ్ యాక్సెస్ వంటి సేవలను కూడా కుదించనున్నాయి. కొత్త మార్పుల ప్రకారం.. ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బిఐ ఇప్పటి వరకు అద్దె చెల్లింపులపై ఇస్తున్న రివార్డు పాయింట్లను నిలిపివేయనుంది. ఎస్‌బిఐ కార్డ్ ఎలైట్, సింప్లీ క్లిక్‌పై వీటి ప్రభావం పడనుంది. అలాగే విమానాశ్రయాల్లో కాంప్లిమెంటరీ లాంజ్ యాక్సెస్ విషయంలో ఐసిఐసిఐ బ్యాంకు మార్పులు తీసుకొచ్చింది. దీని ప్రకారం..ఈ సదుపాయం పొందాలంటే కార్డు ద్వారా మూడు నెలల్లో కనీసం రూ.35 వేలు ఖర్చు చేయాల్సివుంటుంది. కోరల్ క్రెడిట్ కార్డు, మేక్ మై ట్రిప్ ఐసిఐసిఐ ప్లాటినం కార్డులకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. యస్ బ్యాంక్ కూడా ఐసిఐసిఐ బ్యాంక్ తరహాలోనే నిబంధనలు సవరించింది. గడిచిన త్రైమాసికంలో కార్డు ద్వారా కనీసం రూ.10 వేలు ఖర్చు చేసినవారికే లాంజ్ యాక్సెస్ సదుపాయం వర్తిస్తుందని యస్ బ్యాంకు తెలిపింది. ఇక యాక్సిస్ బ్యాంకు అందిస్తున్న మాగ్నస్ క్రెడిట్ కార్డుపై రివార్డు పాయింట్లను, లాంజ్ యాక్సెస్, వార్షిక ఛార్జీల విషయంలో మార్పులు చేసింది. ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ పొందాలంటే మూడు నెలల్లో కనీసం రూ.50,000 ఖర్చు చేయాల్సి ఉంటుంది.

కోడ్ ఉల్లంఘనే

48 గంటల్లోగా కేంద్ర మంత్రిపై చర్యలు తీసుకోండి: ఇసి ఆదేశం

న్యూఢిల్లీ: తమిళనాడుపై విద్వేష పూరిత వ్యాఖ్యలు చేసినందుకు గాను కేంద్ర సహాయ మంత్రి , బెంగళూరు ఉత్తర బిజెపి అభ్యర్థి శోభా కరండ్లాజెపై 48 గంటల్లో చర్యలు తీసుకోవాలని కర్ణాటక ప్రధాన ఎన్నికల అధికారిని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది .. బెంగళూరు కేఫ్ పేలుడు ఘటనకు సంబంధించి శోభ చేసిన ప్రకటన తమిళనాడు నుంచి శిక్షణ పొందిన వ్యక్తులు బాంబులు వేసేందుకు కర్ణాటకకు వస్తున్నారని తెలిపారు. కేరళకు చెందిన వారు యాసిడ్ దాడులకు పాల్పడుతుండగా, ఢిల్లీ నుంచి పాకిస్థాన్ జిందాబాద్ అని కొందరు అంటున్నారని ఆమె దుర్భాషలాడారు. ఈ విద్వేషపూరిత వ్యాఖ్యలపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. . దీనిపై మదురై పోలీసులు శోభపై కేసు కూడా నమోదు చేశారు. వివాదం తర్వాత కరంటాలజే తమిళనాడుపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు.

యుద్ధ జ్వరంతో ఇజ్రాయెల్

- గాజాలో దాడులు ఉధృతం • వారంలో 10 మంది వాలంటీర్లు మృతి
- సగం మంది ఆకలితో అలమటిస్తున్నారు : ప్రపంచ బ్యాంక్

గాజా సిటీ: పాలస్తీనా భూభాగానికి సహాయాన్ని ఇజ్రాయిల్ ఒకవైపు అడ్డుకుంటూ, మరో వైపు దాడులను తీవ్రతరం చేసింది, ఉత్తర గాజాలో దాదాపు రెండు లక్షల మంది ప్రజలు ఆహారం, మందులు లేక ఆకలితో అలమటిస్తున్నారని ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొంది. ఇజ్రాయెల్ ఒక వారంలో అవసరమైన సామాగ్రిని పంపిణీ చేస్తున్న 100 మంది వలంటీర్లను చంపేసింది. దీంతో సహాయం అందక గాజా ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు.ఆసుపత్రుల్లో చికిత్స అందకపోవడం, ఆహార లేమితో పలువురు పిల్లలు చనిపోతున్న హృదయ విదారక పరిస్థితి నెలకొంది. ఇజ్రాయెల్ ఆసుపత్రులు, జనాభా కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ బాంబుదాడులు సాగిస్తోంది. ఈ దాడుల్లో ఇప్పటివరకు 13,450 మంది చిన్నారులు చనిపోయినట్లు యూనిసెఫ్ వెల్లడించింది. ఇది నాలుగేళ్లలో ప్రపంచంలో చనిపోయిన మొత్తం శిశువుల సంఖ్య కంటే ఎక్కువ.

బుధవారం గాజా నగరంలోని అల్-షిఫా ఆసుపత్రిపై జరిగిన దాడిలో పిల్లలతో సహ 90 మంది మరణించారు. ఈ ఆసుపత్రిపై ఇలా దాడి చేయడం ఇది నాలుగోసారి అల్ జజీరా టీవీ తెలిపింది. గాయాలతో, ఆకలితో, అర్ధాకలితో ఆస్పత్రికి తీసుకొచ్చే పసికందులకు నొప్పి నివారణ మాత్రలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. గాజాలో గడచిన 24 గంటల్లో మరో 104 మంది చనిపోయారు. అక్టోబరు 7, 2023 నుండి ఇప్పటివరకు ఇజ్రాయిల్ సాగిస్తున్న ఈ దాడుల్లో 32 వేల మందికిపైగా పాలస్తీనీయులు చనిపోయారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 23 లక్షల మంది గాజన్లలో దాదాపు సగం మంది తీవ్రమైన ఆకలితో బాధపడుతున్నారు. గాజాలోని ఆరోగ్య కేంద్రాలపై ఇజ్రాయెల్ 410 సార్లు దాడి చేసిందని, ఈ దాడుల్లో 685 మంది ఆరోగ్య కార్యకర్తలు మరణించగా, . 104 అంబులెన్స్‌లు ధ్వంసమయ్యాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) వెల్లడించింది.కాల్పుల విరమణ చర్చలు ఎక్కడా లేవు

కాల్పుల విరమణ పై దోహాలో చర్చలు

గాజా కాల్పుల విరమణ మరియు బందీల విడుదలపై మధ్యవర్తిత్వ చర్చలు దోహాలో కొనసాగుతున్నాయి. చర్చకు ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిన తర్వాత, మొస్సాద్ చీఫ్ డేవిడ్ బర్నియాతో సహ ఒక బృందం దోహాకు చేరుకుంది. తాత్కాలిక కాల్పుల విరమణ, గాజాకు మరింత సాయం వీటి ఆధారంగానే చర్చలు జరుగుతున్నాయని ఖతార్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మజిద్ అల్ అన్సారీ స్పందించారు. అయితే హమాస్‌ను పూర్తిగా నిర్మూలిస్తామని ఇజ్రాయెల్ గట్టిగా చెబుతోంది.




మీ కోసం

వెన్న కాచేటప్పుడు కొద్దిగా మెంతులు వేస్తే నెయ్యి మంచి వాసనతో ఉండడంతో పాటు ఎక్కువకాలం నిల్వ ఉంటుంది.

జీవన సౌరభం

ఉన్నత వ్యక్తిత్వాన్ని సంతరించుకునే క్రమంలో ఎదురయ్యే సవాళ్లే జీవిత నిర్మాణంలో పునాది రాళ్లు.

కప్ప తప్పు



నందనమనే చెరువు యుండె
అందులోన కప్ప యుండె
అక్కడికొక పాము వచ్చి
కప్ప మైత్రి కోరుచుండె

ఎలుకలు కడు నా కిష్టము
అవి దొరకకున్న కష్టము
నాకు వాటి జాడ తెలుప
నీకు చేయ ఏ నష్టము

పాము మాట కప్ప వినెను
అది మైత్రి చేయ దలచెను
వేగమె తీరముకు వచ్చి
ఎలుక జాడ అది చెప్పెను

కప్ప పిలువ ఎలుక వచ్చె
పాము చేత అదియు చచ్చె
రోజుకొకటి చొప్పుననూ
కప్ప పిలువ పాము మెచ్చె

ఎలుకలన్ని అయిపోయెను
కప్ప పిలువ రావయ్యెను
పాము అప్పుడు చెరువునకు
పోదామనుచును పలికెను

కప్ప నమ్మెను శత్రువును
అవి చేరెను ఆ చెరువును
కప్ప పిల్లలను సైతం
రహస్యంగ పాము తినెను

చిరు కప్ప గమనించెను
మోసాన్ని గ్రహియించెను
తల్లి కప్ప వద్ద చేరి
జరిగినదీ వివరించెను

పాము చేత కప్ప మెప్పు
అయ్యో! అది ఎంత తప్పు
చివరికి తన పిల్లలకును
కలిగెను గదా!
పెను ముప్పు

కప్ప ఎంతో బాధపడెను
తన తప్పును తెలిసికొనెను
ఇక మీదట శత్రువునూ
నమ్మననుచు అది పలికెను

మిగిలిన తన బిడ్డ తోడ
వెళ్లి చూసె చెరువు జాడ
అక్కడుండ దానికి మరి
తొలగెను ఆ పాము పీడ!


- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
ధర్మపురి, 99085 54535.

సరైన అంకెలు వేయండి



పిల్లలూ, ఇక్కడ ఉన్న గడియారంలో అంకెలు వేయాలి. పక్కనే ఉన్న క్లూ ఆధారంగా రాయండి.

నేను గీసిన బొమ్మ





ఎన్.మహోన్నత్,
1వ తరగతి,
ఆర్యభట్ట హైస్కూల్,
నల్లకుంట్ల, హైద్రాబాద్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆ అవగాహన అబ్బాయిలకూ ఉండాలి ...

'నిద్రపోతున్న సమాజాన్ని మేల్కొల్పాలంటే భగత్‌సింగ్ చేసినట్లు ఓ బాంబు విసరాలి' అంటున్నాడు ఉత్తరాఖండ్‌కి చెందిన 40 ఏళ్ల జితేంద్ర భట్. అతని మాటల వెనుక, సమాజాన్ని చైతన్యం చేయాలనే కాంక్ష ఉంది.సమాజంలో పాతకుపోయిన మూఢ నమ్మకాన్ని పారదోలాలన్న తపన కనపడుతుంది. గతేడాది జులైలో జితేంద్ర కుమార్తె మొదటి పీరియడ్‌ని చూసింది. ఆ విషయాన్ని అతను వినూత్నంగా తెలియజేశాడు. ఆ చర్య ఇప్పుడు చర్చనీయాంశమైంది.

మ్యూజిక్ స్కూలు నిర్వహిస్తున్న జితేంద్ర తన కుమార్తె మొదటి పీరియడ్ కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించాలనుకున్నాడు. బంధువులను, తన స్కూల్లో ఉన్న అమ్మాయిలతో పాటు అబ్బాయిలను కూడా వేడుకకు రావాలని ఆహ్వానించాడు. అందరికీ భిన్నంగా నిర్వహించిన ఆ కార్యక్రమానికి ఒక్క బంధువు కూడా రాలేదు. మ్యూజిక్ స్కూలు విద్యార్థులు మాత్రం వచ్చారు.

ఆ రోజు ఎంతో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా మ్యూజిక్ స్కూల్‌ని అలకరించారు. తన కుమార్తెతో కేకు కట్ చేయించాడు. ఆ తరువాత తనతో అమ్మాయిలకు శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేయించాడు. ఈ కార్యక్రమం జరిగేటప్పుడు అబ్బాయిలంతా చప్పట్లు కొట్టారు. అమ్మాయిలు ఏమాత్రం సిగ్గుపడకుండా ఆ బహుమతులను తీసుకున్నారు. 'ఈ మార్పు ఇక్కడ ఒక్కచోటే కాదు.. అన్ని చోట్లా రావాలి. అప్పుడే రుతుక్రమం చుట్టూ ఉన్న అపోహలు తొలగిపోతాయి' అంటున్నాడు జితేంద్ర.

దేశంలో చాలా చోట్ల అసోం, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో మొదటి రుతుస్రావ కార్యక్రమాన్ని ఓ వేడుకలా నిర్వహిస్తుంటారు. అయితే అవి జితేంద్ర నిర్వహించినట్లు విభిన్నంగా మాత్రం ఉండవు. మరి ఎలా ఉంటాయి?

స్ఫూర్తి (33) బెంగుళూరులో నివసిస్తోంది. 15 ఏళ్లప్పుడు తనకెదురైన మొదటి పీరియడ్ అనుభవాన్ని ఇలా చెబుతోంది. 'నాకు మొదటి పీరియడ్ వచ్చినప్పుడు చాలా షాక్ అయ్యాను. స్త్రీగా నేను పరిణతి చెందడానికి ఇది మొదటి దశ అని మా అమ్మ చెప్పింది. చాలా ఘనంగా వేడుక నిర్వహించారు. నేను యుక్తవయసు వచ్చేవరకు కూడా ఇదంతా ఎందుకు చేశారో నాకు అర్థం కాలేదు. మా నానమ్మ మాత్రం ఆ రోజుల్లో నాకు బలమైన ఆహారం పెట్టింది. మసాలా పదార్థాలు తీసుకోకూడదని చెప్పడం గుర్తు. కానీ.. అప్పుడు కొన్ని రోజులపాటు నేను ఒంటరిగా ఓ గదిలో గడిపాను. నాతో ఎవరూ మాట్లాడేవారు కాదు. ఆ క్షణాలు తలచుకుంటే ఇప్పటికీ భయమేస్తుంది' అంటున్న స్ఫూర్తి లాంటి వాళ్లు మనలో ఎంతోమంది.

మయూరి (27) అసోం నివాసి. 12 ఏళ్లప్పుడు తనకి ఎదురైన మొదటి పీరియడ్ అనుభవాన్ని ఇలా పంచుకుంది. 'నాలుగు రోజుల పాటు నేను స్నానం చేయలేదు. ఆ తరువాత నా ముఖానికి పసుపురాసి స్నానం చేయించారు. స్త్రీతత్వానికి ఇది ఆరంభమని నా చుట్టూ ఉన్న మహిళలు చెప్పారు. ఆ సమయంలో మా బంధువుల్లో పురుషులు కూడా ఆ వేడుకలో భాగమయ్యారు. కానీ ఆ తరువాత ఎప్పుడూ నా రుతుక్రమం గురించి వారు పట్టించుకున్న దాఖలా లేదు. వారిలో నా తండ్రి, సోదరుడు కూడా ఉన్నారు' అంటున్న మయూరి లాంటి పరిస్థితి అందరి అమ్మాయిలదీ.


వేడుకలో భాగమౌతున్న పురుషులు ఆ తరువాత ఎందుకు రుతుక్రమ అంశాన్ని పట్టించుకోరు? ఆ సమయంలో ఎదురయ్యే మానసిక, శారీరక రుగ్మతలపై ఎందుకు దృష్టి పెట్టరు? ఈ ప్రశ్నలను ఎప్పటి నుండో చర్చించుకుంటున్నాం. అందుకే..

'పురుషులు కూడా రుతుక్రమంలో ఉండాలి..'

మీరు చదువుతున్నది నిజమే. అయితే రుతుక్రమం అంశాలపై అవగాహన కలిగివుండడమే దీనర్థం. అంటే స్ఫూర్తి తన ఇంట్లో ఎదురైన ఓ అనుభవాన్ని ఇలా చెబుతోంది. 'నా ఆరేళ్ల కొడుకు నేను పీరియడ్‌లో ఉన్నానన్న విషయాన్ని గ్రహిస్తాడు. తనకి ఊహ వచ్చినదగ్గరి నుండి ఆ రోజుల్లో నేను చేసే ప్రతి పనినీ తను గమనిస్తూ వచ్చాడు' అని స్ఫూర్తి చెబుతున్న ఈ సంఘటనలో ఆ పిల్లవాడు రుతుక్రమాన్ని సానుకూల దృక్పథంతో ఆలోచిస్తున్నాడా! ప్రతికూల ప్రభావాలకు లోనై ఆలోచిస్తున్నాడా! అనేది కాసేపు పక్కన బెడదాం.

2015లో ఈ అంశంపై ఓ వార్తా కథనం వచ్చింది. 'పురుషులను రుతుక్రమంలో ఉంచడం' అంటే రుతు పరిశుభ్రత నిర్వహణలో పురుషులు, అబ్బాయిల పాత్రపై ఓ సర్వే నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని 66 గ్రామాల్లో రుతుక్రమం గురించిన చర్చల్లో పురుషులు పాల్గొనడం వల్ల ఎలాంటి సానుకూల దృక్పథం వచ్చిందో అందులో చర్చించారు. ఆ చర్చల ఫలితంగా సకాలంలో శానిటరీ ప్యాడ్లను అందించడంలో పురుషులు చురుకుగా పాల్గొన్నారు. ఇదొక్కటే కాదు, ఆ సమయంలో మహిళల చుట్టూ సానుకూల వాతావరణం వుండేలా ఆ ఇంటి పురుషులు కృషి చేశారు. అంటే ఈ అంశం 'ప్రత్యేకమైన స్థితి నుండి సాధారణ స్థితికి వచ్చినప్పుడు ప్రతి మహిళా రుతుస్రావంలో తాను ఒంటరి అని భావించద'ని సర్వేలో తేలింది.





'ఈ అంశంలో అబ్బాయిలు, పురుషులను చేర్చడం కుటుంబాల నుండే ప్రారంభమవ్వాలి. అన్న, తమ్ముడు, నాన్న, బాబాయి, మామయ్య, సహోద్యోగి ఇలా ప్రతి పురుషుడూ భాగమవ్వాలి. అప్పుడే దీనిచుట్టూ ఏర్పడిన ఎన్నో కఠిన నిబంధనలు ఉల్లంఘించబడతాయి' అంటున్నారు అజీమ్ ప్రేమ్ జీ విశ్వవిద్యాలయానికి చెందిన ముక్తా గుండి.

రుతుక్రమంలో పురుషులు ఉండడం అంటే ఇప్పటికే అర్థమై ఉంటుంది. ఇంకా సులభంగా చెప్పాలంటే ఒక ఉపాధ్యాయుడు రుతుక్రమం గురించి వివరించాల్సి వచ్చినప్పుడు తన తరగతి గది నుండి అబ్బాయిలను బయటికి వెళ్లమని ఆదేశించడు. ఆ సమయంలో అమ్మాయిలను టీజింగ్ చేయొద్దని సూచిస్తాడు. అవసరమైన సాయం చేయమని ప్రోత్సహిస్తాడు. అలాగే ఒక పురుష సర్పంచి తన గ్రామంలో రుతుక్రమ ఉత్పత్తుల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తాడు. వివక్షకు తావివ్వకుండా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తాడు. ఇక జీవితభాగస్వామి కూడా ఆ సమయంలో ఆమెకి అవసరమైన విశ్రాంతి ఇస్తాడు. శారీరకంగా, మానసికంగా ఆమె ఆరోగ్యంగా ఉండేలా ఆరోగ్యకర బంధం కొనసాగిస్తాడు.

జితేంద్ర భట్ ఇదే చేశాడు. తన కుటుంబంలో కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్న క్రతువును కొత్త పంథాలో నిర్వహించాడు. రుతుక్రమం ఓ చాటుమాటు వ్యవహారం కాదని నిరూపించాడు. ఏ ఆడపిల్ల తాను రుతుక్రమంలో ఉన్నానని నాన్నకి, అన్నకి, తమ్ముడికి తెలియకుండా అమ్మకి మాత్రమే వినిపించేలా గుసగుసగా చెప్పనవసరం లేదని తేల్చి చెప్పాడు. శానిటరీ ప్యాడ్ అనగానే రుతుస్రావం మాత్రమే గుర్తుకు రాకూడదని, రుతుక్రమ పరిశుభ్రత అని తెలిసేలా చేశాడు.

రాజ్యాంగానికి అతీతంగా వ్యవహరిస్తున్నారు

తమిళనాడు గవర్నర్‌పై సుప్రీం ఆగ్రహం


న్యూఢిల్లీ : తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి రాజ్యాంగానికి అతీతుడిగా వ్యవహరిస్తున్నారని సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన చర్యలని తీవ్రంగా తప్పుపట్టింది. మాజీ మంత్రి పొన్ముడిని తిరిగి మంత్రివర్గంలో తీసుకునే అంశంపై 24 గంటల్లోగా నిర్ణయం తీసుకోవాలని లేకుంటే తాము జోక్యం చేసుకోవాల్సివుంటుందని హెచ్చరించింది. గవర్నర్ ఆర్‌ఎన్ రవికి వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మాజీ మంత్రి పొన్ముడి, ఆయన భార్య విశాలాక్షికి మద్రాసు హైకోర్టు గతంలో జైలు శిక్ష విధించింది. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఆయన శాసనసభ్యత్వంపై అనర్హత వేటు పడింది. దీంతో ఆయన్ను మంత్రి వర్గం నుంచి తప్పించారు. తాజాగా హైకోర్టును తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. పొన్ముడి చేత మళ్లీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్ర గవర్నర్‌కు సిఫార్సు చేశారు. ఇందుకు గవర్నర్ ఆర్‌ఎన్ రవి నిరాకరించారు. సుప్రీంకోర్టు తీర్పుకే సొంత భాష్యం చెప్పారు. జైలు శిక్షపై స్టే మాత్రమే వచ్చిందని, ఆయనను మంత్రివర్గంలోకి తీసుకోవడం రాజ్యాంగ నైతికతకు విరుద్ధమని పేర్కొన్నారు. దీంతో స్టాలిన్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 'గవర్నర్ వ్యవహార శైలి చాలా ఆందోళనకరంగా ఉంది. ఆయన చర్యలు సుప్రీంకోర్టును ధిక్కరించేలా ఉన్నాయి. ఇలా చేయడం తగదు. శిక్షపై మేం స్టే ఇచ్చామంటే.. అది నిలిచిపోయినట్లే. ఒక వ్యక్తి/మంత్రిపై మనకు విభిన్న అభిప్రాయాలు ఉండొచ్చు. కానీ, పదవిలో ఉన్నప్పుడు రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిందే. 24 గంటల్లోగా ఈ అంశాన్ని గవర్నర్ తేల్చాలి' అని అల్టిమేటమ్ ఇచ్చింది. లేదంటే మేమే ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుందని సిజెఐ నేతృత్వంలో ధర్మాసనం హెచ్చరించింది.

సిపిఎం తొలి జాబితా

క్ర. సంఖ్య	నియోజకవర్గం	అభ్యర్థి
1.	కేరళ – కాసరగోడ్	ఎంవి బాలకృష్ణన్ మాస్టర్
2.	కన్నూరు	ఎంవి జయరాజన్
3.	వడకర	కెకె శైలజా టీచర్ (మహిళ)
4.	కొజికోడ్	ఎలమరం కరీం
5.	పొన్నాని	కెఎస్ హంస
6.	మలప్పురం	వి వసీఫ్
7.	అల్థూర్ (ఎస్‌సి)	కె రాధాకృష్ణన్
8.	పాలక్కడ్	ఎ విజయరాఘవన్
9.	ఛలక్కుడి	సి రవీంద్రనాథ్
10.	ఎర్నాకుళం	కెజె షైయిన్ టీచర్
11.	ఇడుక్కి	జోయస్ జార్జ్
12.	అలప్పుజ	ఎఎం ఆరిఫ్
13.	పతనాంతిట్ట	టిఎం థామస్ ఐజాక్
14.	కొల్లాం	ఎం ముకేష్
15.	అట్టింగల్	వి జోయ్
16.	ప. బెంగాల్–జల్పాయ్‌గురి (ఎస్‌సి)–	దేవరాజ్ బర్మన్
17.	కృష్ణానగర్	ఎస్‌ఎం సాది
18.	డమ్‌డమ్	సుజన్ భట్టాచార్య
19.	జాదవ్‌పూర్	సృజన్ భట్టాచార్య
20.	కొల్‌కతా దక్షిణ	సైరా షా హలీమ్ (మహిళ)
21.	హౌరా	సవ్యసాచి ఛటర్జీ
22.	శ్రీరామపుర్	దిప్సితా ధర్ (మహిళ)
23.	హుగ్లీ	మనోదీప్ సింగ్
24.	తుమ్లుక్	సాయన్ బెనర్జీ
25.	బంకూర	నీలాంజన్ దాస్‌గుప్తా
26.	విష్ణుపుర్ (ఎస్‌సి)	సీతల్ కైబర్తా
27.	బర్ధ్వాన్ ఈడ్ పూర్వ (ఎస్‌సి)	నీరవ్ ఖాన్
28.	అసన్‌సోల్	జహనర ఖాన్ (మహిళ)
29.	త్రిపుర – త్రిపుర తూర్పు (ఎస్‌టి)	రాజేంద్ర రేయాంగ్
30.	రాజస్థాన్–సికార్	అమ్రా రామ్
31.	తెలంగాణ – భువనగిరి	మహ్మద్ జహంగీర్
32.	పంజాబ్ జలంధర్ (ఎస్‌సి)	పురుసోత్తం లాల్ బిల్గా
33.	తమిళనాడు–మదురై	సు వెంకటేశన్
34.	తమిళనాడు – దిండిగల్	ఆర్ సచిదానందం
35.	అండమాన్ నికోబార్ దీవులు	డి అయ్యప్పన్
36.	అస్సాం–బార్పేట	మనోరంజన్ తాలుక్దార్
37.	బీహార్ –ఖగారియా	సంజయ్ కుమార్
38.	జార్ఖండ్–రాజ్‌మహల్(ఎస్‌టి)	గోపెన్ సోరెన్
39.	కర్ణాటక–చిక్‌బల్లాపుర్	ఎంపి మునివెంకటప్ప

ఎట్టకేలకు నంబర్లతో ఇసికి బాండ్ల వివరాలు

- సుప్రీంకోర్టు ఆదేశాలతో అందజేసిన ఎస్‌బిఐ
- ధ్రువీకరిస్తూ అఫిడవిట్ సమర్పణ
- ఖాతాలు, కెవైసి వివరాలు ఇవ్వలేమని వెల్లడి



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను యూనిక్ నంబర్లతో సహా భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బిఐ) గురువారం కేంద్ర ఎన్నికల సంఘానికి (సిఇసి)కి అందజేసింది. అయితే కంపెనీల ఖాతాల వివరాలను, నో యువర్ కస్టమర్ (కెవైసి) వివరాలను సైబర్ భద్రత రీత్యా ఇవ్వలేమని తెలిపింది. ఈ మేరకు ఎస్‌బిఐ ఛైర్మన్ దినేశ్ కుమార్ ఖారా సుప్రీంకోర్టులో కంప్లీయన్స్ అఫిడవిట్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు నిర్దేశానుసారం 'పూర్తి వివరాలు అందజేశా'మని ఆయన తెలిపారు. బాండ్లను ఎవరు కొనుగోలు చేశారు, వాటిని ఏయే పార్టీలు నగదుగా మార్చుకున్నాయి వంటి ముఖ్యమైన వివరాలను సరిపోల్చడానికి యూనిక్ నెంబర్లు ఉపకరిస్తాయి. ఎస్‌బిఐ అందించిన వివరాల్లో కొనుగోలుదారుని పేరు, బాండ్ సీరియల్ నెంబరు, యూఆర్‌ఎన్ నెంబరు, జర్నల్ తేదీ, కొనుగోలు చేసిన తేదీ, ఎక్స్‌పయిరీ తేదీ, బాండ్ విలువ, బాండును జారీ చేసిన బ్రాంచ్ కోడ్, ఇష్యూ టెల్లర్, స్టేటస్‌కు సంబంధించిన సమాచారముంది. బాండును నగదుగా మార్చుకున్న రాజకీయ పార్టీల వివరాలను కూడా అందులో పొందుపరిచారు. బాండ్ సీరియల్ నెంబరు, నగదుగా మార్చుకున్న తేదీ, రాజకీయ పార్టీ పేరు, అకౌంట్ నెంబరులో చివరి నాలుగు అంకెలు, బాండ్ నెంబరు, దాని విలువ, చెల్లించిన బ్రాంచ్ కోడ్, పే టెల్లర్ సమాచారం అందులో ఉంది. రాజకీయ పార్టీల బ్యాంక్ ఖాతా పూర్తి నెంబరును, కెవైసి వివరాలను బహిర్గతం చేయడం లేదని, ఖాతాల భద్రత దృష్ట్యా వీటిని అందించడం లేదని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఎస్‌బిఐ ఛైర్మెన్ తెలియజేశారు. అదేవిధంగా కొనుగోలుదారుల కెవైసి వివరాలను కూడా బయటపెట్టడం లేదు. అయితే రాజకీయ పార్టీల గుర్తింపునకు ఈ వివరాలు అవసరం లేదని ఆయన తెలియజేశారు. 'ఎస్‌బిఐ ఇప్పుడు అన్ని వివరాలూ వెల్లడించింది. బ్యాంక్ ఖాతాల పూర్తి నెంబర్లు, కెవైసి వివరాలు మినహా ఏ సమాచారాన్నీ దాచలేదు' అని ఆయన అందులో తెలియజేశారు. పూర్తి వివరాలు వెల్లడించడంలో దాటవేత వైఖరిని అవలంబిస్తూ వచ్చిన ఎస్‌బిఐపై ఇటీవల సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం, ఈ నెల 21లోగా పూర్తి వివరాలు అందజేయాల్సిందేనంటూ ఎస్‌బిఐని ఆదేశించిన నేపథ్యంలో ఎస్‌బిఐ ఈ వివరాలు సిఇసికి సమర్పించాల్సివచ్చింది.

ఐపిఎల్ సంగ్రామం నేటినుంచే..

- తొలుత ప్రారంభోత్సవ వేడుకలు
- అనంతరం చెన్నై–బెంగళూరు జట్ల మధ్య తొలి మ్యాచ్



చెన్నై: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్–17కు రంగం సిద్ధమైంది. 10 జట్ల కెప్టెన్లు, ఐపిఎల్ ట్రోఫీతో ఉన్న ఫొటోలను బిసిసిఐ ట్విట్టర్(ఎక్స్)లో గురువారం విడుదల చేసింది. ఒక ఫొటోలో తొమ్మిది జట్ల కెప్టెన్లు, ఓ వైస్ కెప్టెన్ ఉండగా.. మరో ఫొటోలో ధోనీ, భువనేశ్వర్ కుమార్, డేవిడ్ వార్నర్, శిఖర్ ధావన్ తదితరులు ఉన్నారు. చెన్నై జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వం వహిస్తాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఈ రెండు ఫొటోలనూ కనిపించలేదు. ఐపిఎల్ టోర్నీ చరిత్రలో రోహిత్, కోహ్లి లేకపోవడం ఇదే తొలిసారి. సాయంత్రం 5.30గం.ల నుంచి ఎం.ఎ. చిదంబరం(చెపాక్) స్టేడియంలో ప్రారంభోత్సవ వేడుకలు జరగనున్నాయి. అనంతరం డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై, బెంగళూరు జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో ఈ సీజన్ ఐపిఎల్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్(సిఎస్‌కె)కు బాధ్యతలు వహించేది ధోనీ కాదని ఆ ఫ్రాంచైజీ తాజాగా ప్రకటించింది. అలాగే బెంగళూరు, ముంబయి, సన్‌రైజర్స్, పంజాబ్ కింగ్స్, గుజరాత్ ఫ్రాంచైజీలు నూతన సారథులను ఎంపిక చేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి.

చెన్నై కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్

చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ కీలక మార్పు చేసింది. ఐదుసార్లు టైటిళ్లు అందించిన ఎంఎస్ ధోనీని కెపెన్సీ బాధ్యతల నుంచి తప్పించి రుతురాజ్ గైక్వాడ్ పగ్గాలు అప్పగించింది. ఈ సీజన్ తర్వాత ధోనీ ఐపిఎల్ నుంచి వైదొలుగుతాడని, ఈ క్రమంలోనే యువ క్రికెటర్లకు పగ్గాలు అప్పగించేందుకు స్వచ్ఛందంగా సారథ్య బాధ్యతలనుంచి తప్పుకున్నాడని సమాచారం. 2013 స్పాట్ ఫిక్సింగ్ నేపథ్యంలో ఫ్రాంచైజీని సస్పెండ్ చేసిన మినహా మిగతా మిగతా అన్ని సీజన్లకు కెప్టెన్ సేవలందించాడు. 2022 సీజన్ ప్రారంభంలో రవీంద్ర జడేజాకు పగ్గాలు అప్పగించగా.. ఎనిమిది మ్యాచ్‌ల అనంతరం ధోనీ కెప్టెన్సీ బాధ్యతలు అందుకున్నాడు. ఐపిఎల్ చెన్నైకు 212 మ్యాచ్‌లకు నాయకత్వం వహించగా.. 128 మ్యాచ్‌లు గెలిచి.. 82 మ్యాచుల్లో ఓటమిపాలైంది. గత ఏడాది అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్‌లో ధోనీ నేతృత్వంలోని చైన్నై సూపర్ కింగ్స్ జట్టు ఐదోసారి టైటిల్‌ను సాధించింది. 2020 నుంచి అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ధోనీ ఐపిఎల్‌లో మాత్రం కొనసాగుతున్నాడు.

షమీ ఔట్.. సందీప్‌కు ఛాన్స్..

2022 ఛాంపియన్, 2023 రన్నరప్ గుజరాత్ టైటాన్స్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. దీంతో అతడు ఈ సీజన్ ఐపిఎల్ మొత్తానికి దూరమైనట్లు ఆ ఫ్రాంచైజీ గురువారం వెల్లడించింది. వన్డే వరల్డ్‌కప్ సందర్భంగా గాయపడ్డ షమీ పూర్తిగా కోలుకునేందుకు మరింత సమయం పట్టనున్నట్లు ఫ్రాంచైజీ తెలిపింది. ఇక అతడి స్థానంలో యువ మీడియం పేసర్ సందీప్ వారియర్‌ను జట్టులోకి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. కేరళకు చెందిన సందీప్ కనీస ధర రూ.50 లక్షలకు గుజరాత్ తరపున ఆడనున్నాడు.

కెప్టెన్ మారినా.. సన్‌రైజర్స్ రాత మారేనా..!

గత రెండు సీజన్‌ల నుంచి నిరాశపరుస్తున్నట్లు సన్‌రైజర్స్‌కు కెప్టెన్ మార్పు ఏమాత్రం కలిసిరానుందో తేలిపోనుంది. రెండు సీజన్లలోనూ సన్‌రైజర్స్ పాయింట్ల పట్టికలో చివరి స్థానాలకే పరిమితమవుతూ అభిమానులను నిరాశపరిచింది. ఈ క్రమంలో రూ.20కోట్ల భారీ మొత్తం వెచ్చించి మరీ కొత్త కెప్టెన్‌ను తీసుకుంది. తమ జట్టు భవితవ్యం మారిపోతుందన్న ఆశలతో ఎడిషన్‌లో పోటీకి సిద్ధమైంది. జట్టు సారథిగా బాధ్యతలు చేపట్టిన ఆస్ట్రేలియా స్టార్ ప్యాట్ కమిన్స్ ఎస్‌ఆర్‌హెచ్ అభిమానులకు భరోసా ఇచ్చేలా కీలక వ్యాఖ్యలు చేశాడు. శుక్రవారం నుంచే ఐపీఎల్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కమిన్స్ మాట్లాడిన వీడియోను ఎస్‌ఆర్‌హెచ్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. తొలి ప్రత్యర్థి కెకెఆర్ నుంచే దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తామని అందులో తెలిపాడు.

ఐపిఎల్ తొలి దశ పోటీల షెడ్యూల్

తేదీ	మ్యాచ్‌లు	సమయం	వేదిక
22(శుక్ర)	చెన్నై × బెంగళూరు	రా. 8.00గం॥	చెన్నై
23(శని)	పంజాబ్ × ఢిల్లీ	మ. 3.30గం॥	మొహాలీ
	కోల్‌కతా × సన్‌రైజర్స్	రా. 7.30గం॥	కోల్‌కతా
24(ఆది)	రాజస్తాన్ × లక్నో	మ. 3.30గం॥	జైపూర్
	గుజరాత్ × ముంబయి	రా. 7.30గం॥	గుజరాత్
25(సోమ)	బెంగళూరు × పంజాబ్	రా. 7.30గం॥	బెంగళూరు
26(మంగళ)	చెన్నై × గుజరాత్	రా. 7.30గం॥	చెన్నై
27(బుధ)	సన్‌రైజర్స్ × ముంబయి	రా. 7.30గం॥	హైదరాబాద్
28(గురు)	రాజస్తాన్ × ఢిల్లీ	రా. 7.30గం॥	జైపూర్
29(శుక్ర)	బెంగళూరు × కోల్‌కతా	రా. 7.30గం॥	బెంగళూరు
30(శని)	లక్నో × పంజాబ్	రా. 7.30గం॥	లక్నో
31(ఆది)	గుజరాత్ × సన్‌రైజర్స్	మ. 3.30గం॥	గుజరాత్
	ఢిల్లీ × చెన్నై	రా. 7.30గం॥	విశాఖ
ఏప్రిల్1(సోమ)	ముంబయి × రాజస్తాన్	రా. 7.30గం॥	ముంబయి
2(మంగళ)	బెంగళూరు × లక్నో	రా. 7.30గం॥	బెంగళూరు
3(బుధ)	ఢిల్లీ × కోల్‌కతా	రా. 7.30గం॥	విశాఖ
4(గురు)	గుజరాత్ × పంజాబ్	రా. 7.30గం॥	గుజరాత్
5(శుక్ర)	సన్‌రైజర్స్ × చెన్నై	రా. 7.30గం॥	హైదరాబాద్
6(శని)	రాజస్తాన్ × బెంగళూరు	రా. 7.30గం॥	జైపూర్
7(ఆది)	ముంబయి × ఢిల్లీ	మ. 3.30గం॥	ముంబయి
	లక్నో × గుజరాత్	రా. 7.30గం॥	లక్నో

క్వార్టర్స్‌కు త్రీసా-గాయత్రి

స్విస్ ఓపెన్ టోర్నీ

బసెల్(స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి యువ షట్లర్లు త్రీసా జోలీ–గాయత్రీ గోపీచంద్ ప్రవేశించారు. గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీలో త్రీసా–గాయత్రి జంట 21–10, 21–12తో సహచర ఆటగాళ్ల ప్రియా–మిశ్రాలను చిత్తుచేశారు. ఈ మ్యాచ్ కేవలం 36నిమిషాల్లోనే ముగించింది. అంతకుముందు తొలిరౌండ్‌లో 8వ సీడ్ త్రీసా–గాయత్రి 21–15, 21–12తో అన్‌సీడెడ్, అమెరికాకు చెందిన అన్నె–కెర్రీలను చిత్తుచేశారు. ఇక పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రాజ్‌వత్ క్వార్టర్స్‌కు చేరాడు. గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీలో ప్రియాన్షు 21–13, 21–14తో చైనా షట్లర్ లీ–వాన్–షీపై వరుససెట్లలో నెగ్గాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68